శుక్రవారం
07-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 284
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆఫ్రికా విప్లవయోధుడు మూసి మృతి

ఆఫ్రికా స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవయోధుడు, సీనియర్ కామ్రేడ్ ఎంబులెలో మూసి కన్నుమూశారు. ఆయన మరణం ఆఫ్రికా దేశాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) సంతాపాన్ని ప్రకటించింది. తమ పతకాలను అవనతం చేసి నివాళులర్పించింది.

8లో

మరో కొత్త జిల్లా ?

- 27కి చేరనున్న ఏపీ జిల్లాల సంఖ్య
- మూడు జిల్లాలుగా అరకు
- లక్కీ నంబరు కోసమేనంటూ అధికారవర్గాల్లో చర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
రాష్ట్రంలో మరో కొత్త జిల్లా ఆవిర్భవించనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 25కి ఒకటి అదనంగా 26 జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీ నుంచి కొత్త జిల్లాల్లో పాలన సైతం ప్రారంభం కాగా, ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం అధికారవర్గాలు సంబరాలు జరుపుకున్నాయి. అయితే భౌగోళికంగా అతిపెద్ద నియోజకవర్గమైన అరకు పార్లమెంటరీ నియోజకవర్గాన్ని ప్రభుత్వం రెండు జిల్లాలుగా ఏర్పాటుచేసినప్పటికీ మిగిలిన జిల్లాలతో పోలిస్తే విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో, పాలనా సౌలభ్యం కోసం ఇందులోనే మరో జిల్లా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు డిప్యూటీ సీఎం రాజన్న దొర సమాచారాన్ని లీక్ చేశారు. దీంతో అరకు ఎంపీ సీటునే మరో జిల్లాగా విభజించబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఇందుకోసం ప్రభుత్వం తెరవెనుక కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పోలవరం పరిధిలోకి వచ్చే గ్రామాలతో పాటు మరికొన్ని ప్రాంతాలను కలుపుతూ ఈ కొత్త జిల్లా ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. జలవనరులశాఖ

- మిగతా 2 లో

సుప్రీంకు ఆర్-5 జోన్ వివాదం

- హైకోర్టు స్టే నిరాకరణతో వేగం పెంచిన ప్రభుత్వం
- మౌలికవసతుల పేరుతో ఆగమేఘాలపై టెండర్లకు ఆహ్వానం
- అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రైతులు
- 14న విచారిస్తామన్న సీజేఐ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఏపీ రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్లస్థలాలు కేటాయించేందుకు ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై అమరావతి ప్రాంత రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రైతులు దాఖలు చేసిన పిటీషన్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిపై ఈనెల 14న విచారణ

- మిగతా 2 లో

మరింత బలంగా ముందుకు

ఏకతాటిపైకి 19 విపక్షాలు

- తిరంగా మార్చ్‌లో ఐక్యతా ప్రదర్శన
- పాల్గొన్న టీఎంసీ, బీఆర్ఎస్, ఎస్పీ
- మోదీ ప్రభుత్వ తీరుకు ఖండన
- దాన్ని గద్దె దించడమే లక్ష్యం
- ప్రజాస్వామ్యంపై మాటలే, ఆచరణ లేదు: ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ:
ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, న్యాయం కోసం ఐక్యంగానే కాకుండా ప్రతి స్థాయిలో మరింత బలాన్ని పుంజుకుంటూ ముందుకు సాగాలని 19 ప్రతిపక్షాలు ప్రతిన బూనాయి. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీఎంసీ, బీఆర్ఎస్, ఎస్పీ, ఆర్‌జేడీ, ఐయూఎంఎల్, జేడీయూ సహా 19 పార్టీలు ఏకతాటిపైకొచ్చి మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సంకల్పించాయి. గురువారం పార్లమెంటు భవనం నుంచి విజయ్ చౌక్ వరకు ఎంపీలు తిరంగా మార్చ్ నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని చేబూని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన అంతాన్ని కాంకిస్తూ కదంతొక్కారు. అదానీ వ్యవహారం, అధిక ధరలు, ప్రజాస్వామ్యంపై దాడులపై గళం వినిపించారు. మోదీ ప్రభుత్వ తీరు మారకుంటే దేశం నిరంకుశత్వం దిశగా అడుగులు వేస్తుందని నొక్కిచెప్పారు.
అయితే టీఎంసీ, బీఆర్ఎస్, ఆప్, ఎస్పీ వేరొక కూటమి కోసం ప్రయత్నాలు చేసిన క్రమంలో తాజా పరిణామం ఆసక్తికరంగా మారింది. తిరంగా మార్చ్‌లో 19 ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. ఒకటే లక్ష్యం కోసం తమ మధ్య అభిప్రాయ, సిద్ధాంత భేదాలను మర్చి ఏకమయ్యాయి. దీంతో విపక్షం బలం పెరిగిందని ఎంపీలు అన్నారు.
కాగా తిరంగా మార్చ్ అనంతరం రాజ్యాంగ క్లబ్‌లో ప్రతిపక్ష నేతలు సంయుక్తంగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలను వాషౌట్ చేయడమే కేంద్రప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సిద్ధాంతాలపై మాటలకే మోదీ ప్రభుత్వం పరిమితమని విమర్శించారు. అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ కోసం విపక్షం చేస్తున్న డిమాండ్ నుంచి అందరి దృష్టి మళ్లించేందుకు పార్లమెంటు కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తుంటారని అధికార పక్షసభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం గురించి ప్రభుత్వం మాట్లాడుతుందిగానీ ఆచరించదని నొక్కిచెప్పారు. 'రూ.50లక్షల కోట్ల బడ్జెట్‌ను కేవలం 12 నిమిషాల్లో ఆమోదించేశారు. మరోవైపు విపక్షాలకు ఆసక్తి

- మిగతా 2 లో

పేదల భూములు పంచుకుంటారా?

ఇళ్లు నిర్మించుకోండి...అండగా ఉంటాం

శెట్టిపల్లి భూములు పరిశీలించిన నారాయణ

విశాలాంధ్రబ్యూరో- తిరుపతి:
చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్న హక్కుదారులు తమ నివేశన స్థలాలలో ఇళ్లు నిర్మించుకోవాలని, వామపక్షాలు అండగా ఉంటాయని శెట్టిపల్లి భూ బాధితులకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ భరోసా ఇచ్చారు. తిరుపతి అర్బన్ శెట్టిపల్లి గ్రామపంచాయతీ బాధితుల భూములను నారాయణ గురువారం స్వయంగా పరిశీలించారు. సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, బాధితులు పెద్దసంఖ్యలో నారాయణ వెంట ఉన్నారు. బాధితులు తమ సమస్యలను

- మిగతా 2 లో

ఊకదంపుడు ప్రసంగం

- 9 ఏళ్లలో దేశం సర్వనాశనం
- విపక్షాలపై నిందలు, దాడులు
- ప్రధాని మోదీ తీరుపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర-గుంటూరు:
బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో డొల్లతనం స్పష్టంగా కనిపించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఊకదంపుడు ప్రసంగాలు తప్ప ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. 9 ఏళ్లలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని మండిపడ్డారు. దీనికిబదులు ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి, నియోజకవర్గాల సమితి సభ్యులు, ప్రజాసంఘాల ముఖ్యకార్యకర్తల జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం ఇక్కడి మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో గురువారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధిని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయంటే మోదీ మాటలను తీవ్రంగా ఖండించారు. మోదీ హయాంలో దేశంలో పేదరికం తగ్గిందా? పెరిగిందా అని ప్రశ్నించారు. దేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయని చెప్పారు. రూపాయి విలువ దారుణంగా పడిపోయిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గితే భారత్‌లో పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల

- మిగతా 2 లో

నాకు ప్రజలతోనే పొత్తు

- ఏదైతే చెప్తానో అదే చేస్తా
- ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభ సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-చిలకలూరిపేట:
'మీ బిడ్డను ఎదుర్కొనలేక తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి... ఎత్తులు, జిత్తులు, పొత్తులు, కుయుక్తులతో రాజకీయాలు చేస్తున్నారు... నాకు పొత్తుల్లేవ్... పొత్తులపై ఆధారపడను... నాకు పొత్తు ఉంటే అది ప్రజలతోనే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక విప్లవం ప్రతీ గడపకూ కనిపిస్తుందని పేర్కొన్నారు. స్కాములు తప్ప స్కీములు తెలియని బాబులు... సామాజిక న్యాయం తెలియని పరాన్న జీవులు అంటూ ప్రతిపక్ష టీడీపీపై విమర్శలు ఎక్కుపెట్టారు. 'వాళ్లలా నాకు అర్థబలం, అంగబలం లేకపోవచ్చు... వాళ్లకు లేని దేవుడి దయ, ప్రజల చల్లని దీవెనలు నాకున్నాయి... నేను ఏదైతే చెప్తానో అదే చేస్తా... మీ ఇంట్లో మంచి జరిగితే తోడుగా ఉండండి... మీ బిడ్డకు మీరే సైనికులు' అని సీఎం జగన్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో గురువారం సీఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రారంభించారు. ముందుగా హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వాకపల్లి బాధితులకు నష్టపరిహారం

- దర్యాప్తు వైఫల్యంతోనే పోలీసులకు క్లీన్‌చిట్
- అధికారులపై విచారణకు కోర్టు ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
రాష్ట్రంలో సంచలనంగా మారిన వాకపల్లి కేసులో ఎట్టకేలకు తీర్పు వెలువడింది. నిందితులుగా ఉన్న పోలీసులకు క్లీన్‌చిట్ లభించింది. జిల్లా న్యాయ సేవల యంత్రాంగం ద్వారా అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆరవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి & ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఆదేశాలిచ్చింది. ఈ తీర్పు వాకపల్లి బాధిత మహిళలు న్యాయపోరాటంలో విజయం సాధించారనేందుకు సూచికని ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల ఫోరం పేర్కొంది. బాధితుల్లో ఇద్దరు చనిపోవడాన్ని గుర్తుచేసింది. ఇన్నేళ్లు న్యాయం కోసం వారు పోరాడటం ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజేశ్, ఉభయ రాష్ట్రాల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కొన్నారని, తమకు తెలియని భాషలో క్రాస్ ఎగ్జామినేషన్‌ను తట్టుకున్నారని, ఇన్నేళ్లు న్యాయం కోసం ఎదురుచూశారని, నేడు వెలువడినది చరిత్రాత్మక తీర్పు అని వారు పేర్కొన్నారు. కాగా, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడంలో ఇద్దరు దర్యాప్తు అధికారులు విఫలమయ్యారని, అందువల్లే నిందితులకు క్లీన్‌చిట్ లభించిందని తీర్పు వెలువరించే సమయంలో న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 8వ అదనపు జిల్లా

- మిగతా 2 లో

పార్లమెంట్ సమీపంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మోదీకి వ్యతిరేకంగా నినాదాలు

న్యూఢిల్లీ:
దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ సమీపంలో గురువారం ఒక వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసిన సమయంలో ఈ దేశాన్ని కాపాడండి అంటూ.. మోదీకి వ్యతిరేకంగా ఆ వ్యక్తి నినదించాడు. బాధిత వ్యక్తిని రోహిణికి చెందిన రాజ్‌కుమార్ శర్మగా పోలీసులు గుర్తించారు. పార్లమెంట్ సమీపంలో రాజ్ కుమార్ శర్మ ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందన్న కోణంలో ఢిల్లీ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మద్దతుగా ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది.

వడ్డీరేట్లు యథాతథం

ఆర్బీఐ కీలక నిర్ణయం

ముంబై:
వడ్డీ రేట్ల పెంపు విషయంలో ఊహించని రీతిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటులో ఎలాంటి మార్పులు చేయకుండా 6.50 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించింది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. ఈ నిర్ణయా న్ని మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు సమర్థించినట్లు వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే తొలి ద్రవ్యపరపతి విధాన సమీక్ష. ఈ నెల 3వ తేదీన ఎంపీసీ సమీక్షా సమావేశం ప్రారంభమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతం ఉంటుందని లెక్కగట్టింది. బ్యాంకింగ్, బ్యాంకింగేతర సంస్థల ఆర్థిక కార్యకలాపాలు బాగున్నాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. ఇటీవల అభివృద్ధి చెందిన దేశాల్లో
బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని ఆర్బీఐ నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొ న్నారు. ఈ బ్యాంకుల వైఫల్యం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. ధరల పెరుగుదల, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం

- మిగతా 2 లో



పుస్తక సమీక్ష

క్యూబాలో సోషలిజాన్ని ఎలా కాపాడారు?

గ్రంథకర్త: పెడ్రో రోజ్
సమీక్ష: రిచర్డ్ క్లార్క్

1959 విప్లవానంతరం ఒక చిన్న, స్వతంత్ర, సోషలిస్టు రిపబ్లిక్ క్యూబా ఎలా నిలబడింది? ఇది ఒక అద్భుతం.

అది నిలబడిన తీరు ముఖ్యంగా సోవియట్ యూనియన్ విచ్ఛితి తర్వాత ఒక అసాధారణ పరిణామం. సోవియట్ యూనియన్ సోషలిజంలో పరిమితులు ఉండవచ్చు కానీ అది సోషలిస్టు ప్రయోగాలలో ఒక వినూత్న పరిణామం. క్యూబా విషయానికొస్తే అది సోవియట్ యూనియన్‌తో ప్రధాన వాణిజ్య భాగస్వామ్యాన్ని కలిగివుంది. అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా ఇది సాధ్యమైంది.

గ్రంథకర్త పెడ్రో రోజ్ క్యూబన్ ట్రేడ్ యూనియన్ (కార్మిక సంఘం) మాజీ ప్రధాన కార్యదర్శి. సోవియట్ సోషలిజం పతనానంతరం క్యూబా నిలబడి... స్పందించిన తీరును సాధికారికపూర్వకంగా ఆయన వివరించారు. ఉదాహరణకు 1989, 1992 మధ్యలో క్యూబా ఆర్థిక వ్యవస్థ దాని వస్తు సేవల ఉత్పత్తి మూడో వంతుకు పడిపోయాయి.

దిగుమతులు 80శాతం కోల్పోయింది. ఆహారం, మంచినీరు, విద్యుత్, రవాణా వంటివన్నీ తీవ్ర కొరతను ఎదుర్కొన్నాయి.

అంతకుముందు సోవియట్ యూనియన్ నుంచి ఇంధనం దిగుమతయ్యేది. క్యూబా నుంచి ఆ దేశానికి వ్యవసాయోత్పత్తులు ఎగుమతి అయ్యేవి. సోవియట్ యూనియన్ పడిపోయిన తర్వాత క్యూబా ఉత్పత్తి చేసే చక్కెర ధరలు క్షీణించాయి.

ఈ పరిణామంతో పెద్ద బడ్జెట్ కొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ద్రవ్య చలామణి పెరిగింది. బ్లాక్ మార్కెట్ విజృంభించింది. చట్టవ్యాపారాలు పెరిగాయి. ఇది నాటి ఆర్థిక పరిస్థితి. ఆ కారణంగా క్యూబాలో ముఖ్యంగా రాజధాని నగరం హవానాలో అశాంతి నెలకొన్నది. ఆందోళనలు జరిగాయి. ప్రదర్శనలు తలెత్తాయి. ఈ పర్యవసానాలను ఫిడెల్ కాస్ట్రో ఇతర నాయకులు గుర్తించారు. ఆ సందర్భంగా వారు చేసిన ఉపన్యాసాలు స్ఫూర్తిదాయకమైనవి. కానీ విషయం ఏమంటే ఈ పరిణామాలు క్యూబా నాయకత్వంలో ఒక రాజకీయ, భావజాల సంక్షోభాన్ని కలిగించాయి. సాధారణ ప్రజలలో సరేసరి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వర్కర్స్ పార్లమెంట్ పునరుజ్జీవం జరిగింది. ఇది 1980వ దశకంలో పున:ప్రారంభమైంది.

వర్కర్స్ పార్లమెంట్ అంటే ఏమిటి?

కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలలో, స్థలాలలో తమకు తామే ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే వారు. ఉదాహరణకు 1994 ప్రారంభం నుంచి 45 రోజుల పాటు 80వేల కార్మికులతో పార్లమెంటు సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లో తీవ్ర చర్చోపచర్చలు సాగాయి. తాము పనిచేసే ఫ్యాక్టరీల నుంచి జాతీయ ఆర్థిక వ్యవస్థ వరకు అన్ని సమస్యలపైనా చర్చించడమే కాకుండా తీసుకు రావాల్సిన మార్పుల గురించి వారు నిర్ధారణకు వచ్చేవారు.

గ్రంథకర్త రోజ్ రచనలో 80 వ్యాసాలను పొందుపర్చారు. ఆ విశ్లేషణ తీరు చారిత్రక రాజకీయ నేపథ్యం అభినందనీయం. వ్యవసాయం, సిగార్‌ల తయారీ, ఆసుపత్రులు, ఆహార పదార్థాల తయారీ, పాల ఉత్పత్తులు- వీటన్నింటిపైనా ఆ చర్చలు సాగేవి. ఒక రకంగా అదొక ఆర్థిక బృహత్ పాఠశాల. స్వీయ అధ్యయనం, రాజకీయ నిర్ణయాలు అందులో భాగంగా ఉండేవి.

ఈ పరిణామం సాఫీగా జరిగినదేమీ కాదు. చాలా బలహీనతలు వ్యక్తమయ్యాయి. బ్యూరోక్రసీని ఎదుర్కోవాల్సి వచ్చింది. గైర్హాజరు ఒక సమస్యగా మారింది. ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో నాణ్యత దెబ్బతిన్నది. వనరుల పంపిణీలో అవకతవకలు ఉండేవి. వీటన్నింటినీ అధిగమించాల్సి వచ్చింది.

జాతీయ ఆర్థిక వ్యవస్థపైన చర్చల స్థాయిలో ఒక నూతన ఆర్థిక అవగాహన ఏర్పడింది. అది విదేశీ పెట్టుబడికి కొన్ని రంగాల్లో ద్వారం తెరవడం... ఇంకొన్ని చర్యలు తీసుకోవల్సి వచ్చింది. డాలర్లను కలిగివుండటం నేరం కాదు. ద్రవ్యవ్యవస్థలో ద్వంద్వ విధానం అవలంభించాల్సి వచ్చింది.

మరికొన్ని చర్యలు అనివార్యమయ్యాయి. స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న వ్యవసాయ సంస్థలను సహకార వ్యవస్థలుగా మార్చారు.

ఈ సంక్షోభ కాలంలో క్యూబా ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చని అమెరికా ఊహించింది. క్యూబాపై ఆంక్షలు తీవ్రతరం చేసింది. క్యూబా అస్థిరీకరణకు విచ్ఛిన్న చర్యలకు పాల్పడింది. అంతేకాదు జీవాయుధాలను ప్రయోగించింది. అయినప్పటికీ క్యూబా నిలబడటంతో అమెరికా కొత్త చట్టాలను తీసుకొచ్చింది. అవి 1986 నుంచి అమలయ్యాయి. ఆ చట్టాల ప్రకారం క్యూబాతో వాణిజ్యం జరిపే అమెరికాయేతర కంపెనీలపైనా ఆంక్షలు విధించారు. క్యూబా కావాలో అమెరికా కావాలో నిర్ణయించుకోమని హెచ్చరించడమే దీని అర్థం.

అధ్యక్షుడు ఒబామా కాలంలో కొంత వరకు ఆంక్షలను సడలించారు. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక క్యూబాపై దాడులు మళ్లీ తీవ్రతరమయ్యాయి. క్యూబాలో ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు జరిగాయి. ప్రస్తుతం బైడెన్ పాలనకాలంలోనూ ఈ ఆంక్షలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఉదాహరణకు, నార్వేకు సంబంధించిన ఒక ఓడ హవానాలో ఆగింది. దానిపై అమెరికా ఆంక్షలు-పన్ను విధించింది.

క్యూబా అనేక ప్రకృతి విపత్తులనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. తుపాన్లు, వరదలు, అగ్ని ప్రమాదాలతో వాతావరణంలో మార్పులొచ్చాయి. అయినప్పటికీ క్యూబా నిలచింది. అదొక అద్భుతం!

ఇంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రపంచంలో ఏ దేశంలోనూ సాధ్యం కాని విధంగా అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలిచింది. క్యూబాలో వైద్యసేవలు మరొక ఆదర్శనీయమైన పరిణామం. అమెరికా వంటి దేశంలోని కొన్ని ప్రాంతాలలో క్యూబా సాధించిన ఈ విజయాలను చూసి అసూయపడుతున్నారు. ప్రపంచ విముక్తి ఉద్యమాలకు క్యూబా అందజేస్తున్న సాయం ఒక అసాధారణమైన పరిణామం. వీటన్నింటిలోనూ చెప్పుకోదగినది క్యూబాలో ఫరిడివిల్లుతున్న ప్రజాస్వామ్య పునరుజ్జీవనం. దీనికి ఉదాహరణ వర్కర్స్ పార్లమెంట్ పునరుద్ధరణ.

అదే సమయంలో క్యూబా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభంతో పాటు ఒక సామాజిక రుగ్మత కూడా వెల్లడైంది. ఎన్నికలలో ప్రజల పాత్ర తగ్గుముఖంలో ఉండటం ఒక సమస్య.

సోషలిజం కోసం పోరాడే ప్రతి ఒక్కరూ ఈ గ్రంథాన్ని చదవాలి. సోషలిజం నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లకు ఇది ఒక హెచ్చరిక.

(మార్క్సిజం-లెనినిజం టుడే నుంచి)

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌కు చేనేత కార్మిక సంఘం వినతి

విశాలాంధ్ర- మంగళగిరి: చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిందని, ముఖ్యంగా ఈ పరిశ్రమ ఎక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాంతమైన సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆందోళనకరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకా చలపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి మరమగ్గాలలో విచ్చలవిడిగా చేనేత డిజైన్లు తయారు చేసి వాటిని చేనేత ఉత్పత్తులుగా చూపి అమ్మకాలు సాగిస్తుండటమే ఈ సంక్షోభానికి కారణమని చెప్పారు. ఈ మేరకు అనేక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి అధ్వర్యంలో చేనేత జౌళిశాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌కి తన కార్యాలయంలో గురువారం అందజేశారు. మరమగ్గాలపై చేనేత డిజైన్లను నియంత్రించవలసిన ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు మరమగ్గాల యజమానులతో కలిసి తిరుగుతుండటం చేనేత కార్మికులను అసహనానికి గురిచేస్తున్నదన్నారు. ధర్మవరంలో చేనేత కార్మికులు 'నాకు దారేంటి-నా ఉపాధి మాటేంటి-నా భవిష్యత్తు ఏంటి' అంటూ రెండు రోజులు నిరాహార దీక్ష చేయవలసి రావడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుందన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, మరమగ్గాలపై నిరంతరం తనిఖీలు చేపట్టి ఉల్లంఘనలు ఆపాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్ ధర్మవరంలో ఏర్పాటు చేయాలని, చేనేత కార్మికులకు సబ్సిడీపై ముడిసరుకు అందజేయాలని, చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలని కమిషనర్‌ను కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు జి.బాలాజీ, జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, నియోజకవర్గ కార్యదర్శి డి.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి బత్తూరి మోహన్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాకు ప్రజలతోనే పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం తెలిపే స్టాల్‌ను సందర్శించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ...ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే రోల్ మోడల్‌గా నిలవనుందని తెలిపారు. వైఎస్సార్ చనిపోయిన తర్వాత ఆరోగ్య శ్రీని నీరుగార్చారని ఆరోపించారు. ప్రస్తుతం 2265 ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ విస్తరించామన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయని, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను పీహెచ్‌సీలతో అనుసంధానిస్తామన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు తల్లులు, బాలింతకు వైద్య సేవలు అందిస్తారని, మండలానికి రెండు పీహెచ్‌సీలు.. ప్రతీ పీహెచ్‌సీలో అందుబాటులో ఇద్దరు డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నయం కాని వ్యాధులను విలేజ్ క్లినిక్ ద్వారా ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తామన్నారు. దేశంలో గొప్ప మార్పునకు లింగంగుంట్ల నుంచి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుంచి ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులో వచ్చాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి రూ.3,300 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటిదాకా రూ.9 వేల కోట్లు ఖర్చు చేశామని, ఆరోగ్య ఆసరా కోసం రూ.900 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. చంద్రబాబు పాలనలో వైద్య ఆరోగ్య రంగాలపై రూ.8 వేల కోట్లు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై రూ.18 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.

నాకు రాజకీయ భవిష్యత్ ఇచ్చింది సీఎం జగన్ : రజని

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ... తన రాజకీయ జీవితం సీఎం జగన్ పెట్టిన భిక్ష అని ఉద్వేగానికి లోనయ్యారు. ఆరోగ్య రంగాన్ని చంద్రబాబు అమ్మకానికి పెట్టారని, చంద్రబాబు దోమలపై దండయాత్ర చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో ఓ కొత్త ఆస్పత్రి భవనం కట్టారా? పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు బాబు ఏనాడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం జగన్ మానసపుత్రికని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో వైద్య సేవలు ఉచితమని వివరించారు. చిలకలూరిపేటలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అమృత్ పనుల కోసం మున్సిపాలిటి వాటాగా రూ.63 కోట్లు చెల్లించాల్సి ఉందని, అయితే మున్సిపాలిటీలో నిధుల కొరత కారణంగా ఆ డబ్బు చెల్లించలేకపోతున్నట్లు రజిని సభాముఖంగా తెలపగా... సీఎం సానుకూలంగా స్పందిస్తూ... నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎత్తిపోతల పథకాల మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించి పంపితే నిధులు మంజూరు చేస్తామన్నారు. సభలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దుర్మార్గ విధానాలపై ప్రచార భేరీ

సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ దుర్మార్గ విధానాలపై సీపీఐ, సీపీఎం ఉమ్మడి ప్రచారభేరి నిర్వహించాలని, బీజేపీ ద్రోహం, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలను సంఘటితం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈనెల 3, 4 తేదీల్లో విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి హాజరయ్యారు. సమావేశం వివరాలను గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 14న విజయవాడలో ప్రచార భేరి ప్రారంభించాలని, దీనికి కేంద్ర నాయకులు ప్రకాశ్ కారత్, విజయ్‌విశ్వంలను ఆహ్వానించామని, ఈనెల 30 వరకు ఈ ప్రచారం రాష్ట్రమంతా కొనసాగుతుందని సమావేశం తెలిపింది. బీజేపీ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలపై పోరాడుతూనే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించింది.

మరో కొత్త జిల్లా ?

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరం ముంపు గ్రామాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని మీడియా సమావేశంలో చెప్పారు. ఈ అవకాశాన్ని వారికి ఇవ్వకుండా అధికారపార్టీ తొందరపడుతోంది. దీనినిబట్టి త్వరలో మరో కొత్త జిల్లా రావడం ఖాయమని స్పష్టమవుతోంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పాలనా సౌలభ్యమే లక్ష్యంగా ఈ జిల్లా ఏర్పాటు కానున్నట్లు అధికారపార్టీ నేతలు చెబుతుండగా, లక్కీ నెంబరు 9 కోసమే ప్రభుత్వం మరో జిల్లా ఏర్పాటుకు ఉత్సాహం చూపుతోందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి గతంలోనే మొత్తం 27 జిల్లాలు రాబోతున్నట్లు ప్రచారం జరిగింది. కాని చివరి నిముషంలో దీనిపై కసరత్తు చేసేందుకు అధికారులు కూడా బిజీగా ఉండటంతో ఈ ప్రతిపాదన తాత్కాలికంగా వాయిదా పడింది. అరకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాలకొండ, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాలతో పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు కాగా, పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలతో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటైంది. కొత్త జిల్లా ఏర్పాటుతో ఈ అసెంబ్లీ నియోజకవర్గాల్లో చీలిక రానుంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత దాదాపు 118 నియోజకవర్గాల పరిధిలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవం చెందడాన్ని అధికారపార్టీ అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది. దీనికి లక్కీ నంబరును విస్మరిస్తూ జరిగిన జిల్లాల విభజనను ఒక కారణంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే లక్కీ నంబరు 9 వచ్చేలా 27వ జిల్లా ఏర్పాటు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో టోటల్ 9 వచ్చేలా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రూ.2,79,279.27 కోట్లతో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పద్దును కూడా వారు ఉదహరిస్తున్నారు. ఏదిఏమైనా త్వరలోనే మరో కొత్త జిల్లా ఏర్పాటుతో ఏపీ జిల్లాల సంఖ్య 27కి చేరబోతోంది.

వడ్డీరేట్లు యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కొ నడానికి అప్రమత్తంగా ఉన్నట్లు దాస్ చెప్పారు. యూపీఐ వ్యవస్థనుస్థ విస్తరించడానికి ముందస్తుగా మంజూరైన క్రెడిట్ లైన్లు నిర్వ హించుకునేలా బ్యాం కులకు అనుమతి ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణాన్ని తగ్గించే దిశగా ఆర్బీఐ పనిచేస్తోందన్నారు. క్లెయిమ్ చేయని డిపాజిట్ల కోసం వివిధ బ్యాంకుల్లో వెతకడానికి ఆర్బీఐ కేంద్రీకృత పోర్టల్లను ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. డిపాజిటర్లు యాక్సెస్‌ను మెరుగుపరచడం, విస్తృతం చేయడం కోసం క్లెయిమ్ చేయని డిపాజిట్ల కోసం బహుళ బ్యాంకుల్లో వెతకడానికి వీలుగా వెబ్ పోర్టల్ల ను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే లక్ష్యంగా ఆర్బీఐ గతేడాది మే నుంచి కీలక వడ్డీ రేట్లను పెంచుతూ వస్తోం ది. ఇప్పటి వరకు రెపోరేటును 250 బేసిస్ పాయింట్ల మేర పెంచింది ఆర్బీఐ. అంతకుముందు ఫిబ్రవరిలో రెపో రేటును పెంచింది. 6.25 శాతం ఉన్న రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.5 శాతంగా నిర్ణయించింది. ప్రపంచ బ్యాం క్ తన తాజా 'ఇండియా డెవలప్మెంట్ అప్డేట్' (ఐడీయూ)లో జీడీపీని 2023-24లో 6.6 శాతంగా అంచనా వేయగా.. దానిని 6.3 శాతానికి తగ్గించింది.

ఎస్సీ రైల్వే అడిషనల్ జీఎంగా ధనంజయులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా ఆర్.ధనంజయులు (ఐఆర్‌టీఎస్) గురువారం రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్)కి చెందినవారు. ఇంతకు ముందు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (ఏజీఎం)గా పనిచేశారు. రైల్వేలో ఏరియా ఆఫీసర్/వాస్కోగా తన వృత్తిని ప్రారంభించారు. పదవీ కాలంలో ఆపరేషన్స్, సేఫ్టీ ,కమర్షియల్ డిపార్ట్‌మెంట్లలో వివిధ హోదాల్లో పనిచేశారు.

ఊకదంపుడు ప్రసంగం

(మొదటిపేజీ తరువాయి)

ధరలు పెరిగాయని రామకృష్ణ విమర్శించారు. రైతు ఆదాయం రెట్టింపు కావడం పక్కనపెట్టి...అసలు వ్యవసాయానికే రైతు దూరమయ్యారని పేర్కొన్నారు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. వేలకోట్లు దోచుకొని...విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్తలకు మోదీ సర్కారు అండగా నిలిచిందని ఆరోపించారు. పారిపోయినోళ్లలో విజయ్ మాల్యా మినహా ఇతరులంతా గుజరాతీయులు కారా అని ప్రశ్నించారు. డొల్ల కంపెనీలతో ప్రపంచాన్ని మోసగించిన అదానీని వెంట పెట్టుకుని మోదీ తిరుగుతున్నారని మండిపడ్డారు. అదానీ ఆర్థిక వ్యవహారాలపై జేపీసీ వేయడానికి భయమెందుకని అడిగారు. మోదీ విధానాలు కొద్దిమందికి సంపద పోగుబడటానికి దోహదపడ్డాయన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏపీకి పదేపదే అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 వేలమంది నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా తప్పించుకోవడానికి పోలవరం ఎత్తు తగ్గించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు. మోదీ సహకారంతోనే వైసీపీ ప్రభుత్వం నడుస్తున్నదన్నారు. అందుకు ప్రతిఫలంగా రాష్ట్ర ఎంపీలు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు.

సీపీఐ ప్రతిష్ఠ దెబ్బతీస్తే సహించం: ముప్పాళ్ల

సీపీఐ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పదేపదే సీపీఐ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతయుతమైన పార్టీగా ప్రజల పక్షాన సీపీఐ పోరాటం చేస్తున్నదని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి ధ్వంసానికి ప్రయత్నం జరుగుతుంటే సజ్జల నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. లక్షల కోట్లు తెచ్చి అమరావతి గుంటల్లో పోయాలా అని మంత్రి బొత్స సత్యనారాయణ అంటున్నారని, అలాంటప్పుడు 50 వేల మందికి ఆ గుంటలలో ఇళ్ల స్థలాలు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 14వ తేదీ నుంచి సీపీఐ-సీపీఎం ఉమ్మడిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, ఆ కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మరింత బలంగా ముందుకు

(మొదటిపేజీ తరువాయి)

లేదని, సభకు విఘాతం కలిగిస్తుంటాయని బీజేపీ ఆరోపిస్తుం. పాలకపక్షం వల్లే సభకు విఘాతం కలిగింది. ఎప్పుడు డిమాండ్ చేసినాగానీ మమ్మల్ని మాట్లాడనివ్వలేదు. నా 52ఏళ్ల ప్రజా జీవితంలో ఇలా ఎన్నడూ జరగలేదు. ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇదే కొనసాగితే ప్రజాస్వామ్యం అంతమై నిరంకుశత్వం వర్ధిల్లుతుంది' అని ఖర్గే చెప్పారు. అదానీ వ్యవహారంలో 19 ప్రతిపక్ష పార్టీలు అనేక అంశాలను లేవనెత్తాయి. ఆయన సంపద కేవలం రెండు-రెండున్నరేళ్లలో రూ.12లక్షల కోట్లు ఎలా పెరిగిందని ప్రశ్నించాయి. సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపేందుకు ఎందుకు భయపడుతున్నారన్నదే మా ప్రశ్న. బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ క్షమాపణ చేయాలన్న డిమాండ్ కేవలం ప్రధాన సమస్యపై నుంచి అందరి దృష్టిని మళ్లించేందుకే అని ఖర్గే అన్నారు. అదానీ కేసులో పారదర్శకతకు హామీ కోసం జేపీసీ విచారణకు డిమాండ్ చేశాం. తద్వారా సంబంధిత పత్రాలను పరిశీలించే అవకాశం విపక్షాల ఎంపీలకు లభించేదని చెప్పారు. లోక్‌సభలో రాహుల్‌పై అనర్హత వేటునూ ప్రస్తావించారు. దీనిని మెరుపు వేగంతో జరిగిన పరిణామంగా వర్ణించారు. దోషిగా నిర్ధారణ జరిగి మూడేళ్ల శిక్ష పడిన బీజేపీ ఎంపీపై 16 రోజుల తర్వాత కూడా అనర్హత వేటు పడకపోవడాన్ని ఖర్గే ప్రధానంగా వెల్లడించారు. 2024 ఎన్నికల్లో అదానీ, కులగణన వంటివి కీలకాంశాలుగా ఉంటాయన్న ప్రశ్నకు వాటిపై పార్టీల అధ్యక్షులు తర్వాత భేటీ అయి చర్చిస్తారు.

అయితే కులగణన మా అజెండాలో ముందు ఉంటుందని ఆయన చెప్పారు. భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎంపీ కె.కేశవరావు మాట్లాడుతూ ఇప్పుడు ఏకతాటిపైకి వచ్చిన పార్టీల మధ్య దూరం, అభిప్రాయ భేదాలు ఉన్నాగానీ లక్ష్యం ఒకటే కావడంతో ఒకే వేదికపైకి వచ్చాయని అన్నారు. 'అంచెలంచెలుగా బలం పెంచుకుంటున్నాం. మమ్మల్ని విడదీసేందుకు జరిగినవన్నీ విఫల ప్రయత్నాలుగా పరిణమించాయి. మేముంతా ఐక్యంగా ముందుకు సాగుతున్నాం. రేపు ఎలా పరిణమిస్తో వదిలేద్దాం... ఇప్పుడు కలిసికట్టుగా పనిచేస్తున్నామన్నదే ముఖ్యం' అని ఆయనన్నారు. ప్రతిపక్ష నాయకుడు ఎవరన్న ప్రశ్నకు 'మీకు నాయకత్వం గురించే ఆసక్తి ఎక్కువ. దేశాన్ని ఒక వ్యక్తి నడిపిస్తారు... వారి వెనుక సిద్ధాంతాలు, అనేక కార్యక్రమాలు ఉంటాయి. ఐక కార్యాచరణతో అనుకున్నది సాధించడమే ఇప్పుడు మాకు ముఖ్యం' అని కేకే బదులిచ్చారు.

సుప్రీంకు ఆర్-5 జోన్ వివాదం

(మొదటిపేజీ తరువాయి)

చేపడతామని సీజేఐ స్పష్టంచేశారు. 10న విచారణకు తీసుకోవాలని రైతుల తరపున కోరగా ఆరోజు కేసుల జాబితా ఇప్పటికే తయారైందని జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. అందుకే పిటిషన్‌ను 14న విచారణకు తీసుకుంటామని చెప్పారు. అమరావతి రైతులు ఆర్-5 జోన్‌పై ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో మార్పులు చేసిన ప్రభుత్వం ఆర్-5 జోన్‌ను కూడా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హైకోర్టులో రైతులకు స్టే రాకపోవటంతో ఇదే అదనుగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న నివాస స్థలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు టెండర్లు పిలవాలని సీఆర్‌డీఏను నిర్దేశించింది. దీంతో సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు బుధవారం ఆగమేఘాల మీద రూ.50 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ఇది కూడా అధికారపార్టీకి చెందిన పత్రికలో మాత్రమే టెండర్ ప్రకటనను ప్రచురించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల కల్పనలో భాగంగా ఆరు పనులకు టెండర్లు పిలిచారు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో ఏప్రిల్ 6వ తేదీ నుంచి పనుల వివరాలు అందుబాటులో ఉంటాయని సీఆర్‌డీఏ కమిషనర్ ప్రకటించారు. టెండర్లలో పాల్గొనేవారు బిడ్లను సమర్పించటానికి ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువిచ్చారు. అదేరోజు ఆరు గంటలకు టెక్నికల్ బిడ్లను తెరుస్తారు. ఆర్-5 జోన్‌లో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 49 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వటానికి సిద్ధం కావాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో రెండు జిల్లాల కలెక్టర్లకు నిర్దేశించింది. దీనికిముందుగా ప్రభుత్వం రహస్యంగా జీవో ఎంఎస్ 45 ద్వారా ఆర్-5 జోన్‌లోని 1134.58 ఎకరాలలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 24 వేలమంది లబ్ధిదారులకు 583.93 ఎకరాలు, గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారులకు 550.65 ఎకరాలు కేటాయించినట్లు విడుదల చేసింది. దీనిపై రాజధాని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసం తీసుకున్న భూముల విషయంలో భూ సమీకరణ ఒప్పందాలు, రాజధాని మాస్టర్ ప్లాన్, సీఆర్‌డీఏ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు.

వాకపల్లి బాధితులకు నష్టపరిహారం

(మొదటిపేజీ తరువాయి)

సెషన్స్ జడ్జి, స్పెషల్ కోర్టు విచారణ దుర్మార్గంగా సాగడంతో పోలీసులు నిర్దోషులుగా రుజువయ్యారు. 2007 ఆగస్టు 20న అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లి గ్రామంలో కూంబింగ్ నిర్వహించేందుకు వెళ్లిన 21 మంది పోలీసుల ప్రత్యేక బృందంపై అత్యాచార ఆరోపణలు వచ్చాయి. పోలీసులు అత్యాచారం చేశారని 11 మంది గిరిజన మహిళలు ఫిర్యాదు చేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టులో సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2018లో విశాఖపట్నంలో విచారణ ప్రారంభమై నాలుగేళ్లు సాగింది. దర్యాప్తు అధికారులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరపడంలో విఫలం కావడాన్ని న్యాయస్థానం ప్రధానంగా పేర్కొంది. మొదటి దర్యాప్తు అధికారి బి.ఆనందరావు మరణించినందున, రెండవ దర్యాప్తు అధికారిగా ఎం.శివానంద రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన అపెక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని ఆదేశించింది. ఉద్దేశపూర్వకంగా సరైన విచారణ నిర్వహించని దర్యాప్తు అధికారులపై విచారణకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు. పోలీసులను నిర్దోషులుగా కోర్టు విడుదల చేసిందని, అత్యాచార బాధితులకు జిల్లా న్యాయ సేవల యంత్రాంగం ద్వారా నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించిందని హక్కుల ఫోరం ప్రకటన పేర్కొంది. వాకపల్లి అత్యాచార బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించిందంటే, వారి వాదనలపై న్యాయస్థానం విశ్వాసం చూపినట్లేనని, కేసు ప్రారంభంలోనే దర్యాప్తు రాజీపడిందన్న మహిళా, ఆదివాసీ, హక్కుల సంస్థల దీర్ఘకాల ఆరోపణను ఇది సమర్థిస్తుందని వెల్లడించింది. తోటి పోలీసు సిబ్బందికి రక్షణ కల్పించేందుకే మొదటి రోజు నుంచి విచారణ దురుద్దేశపూర్వకంగా జరిగిందని తెలిపింది. క్రిమినల్ కోడ్ నిర్దేశించిన విధానాలు ఏవీ దర్యాప్తు అధికారులు పాటించలేదని పేర్కొంది. నిరక్షరాస్యులైనప్పటికీ, బాధితులు తమ పోరాటాన్ని విరమించుకోలేదని, న్యాయం కోసం పోరాడారని పేర్కొంది.

పేదల భూములు పంచుకుంటారా?

(మొదటిపేజీ తరువాయి)

నారాయణకు వివరించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ శెట్టిపల్లి రైతులు, నిరుపేదల భూములు లబ్ధిదారులకు పంచడానికి మీరెవరని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు లబ్ధిదారులకు సహాయపడకుండా బినామీలకు వత్తాసు పలుకుతూ కోట్లాది రూపాయలు దోచుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ల్యాండ్ పూలింగ్ పేరుతో 500 ఎకరాలు ప్రజాఅవసరాల కోసం తీసుకొని వాటిని సక్రమంగా ఉపయోగించలేదని, ఈలోగా చంద్రబాబు దిగిపోవాల్సి వచ్చిందన్నారు. ఆ భూములను బాధితులకు అప్పగిస్తామని నాడు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ ఆయన మాటమీద నిలబడలేదని నారాయణ విమర్శించారు. ఆ భూములను అధికార పార్టీ ఎమ్మెల్యేలు పంచుకోవడానికి కుట్ర చేస్తున్నారన్నారు. పేదల భూములు బలవంతంగా లాక్కోవడం సరికాదని హితవు పలికారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని, ఎవరి స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఐ, సీపీఎం నాయకత్వంలో తామే స్వయంగా పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్దశత్రువని, అలాంటి బీజేపీ పంచన చేరడం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు మంచిది కాదని నారాయణ సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన కలిసి ప్రయాణం చేయాలని హితవు పలికారు. బీజేపీతో టీడీపీ, జనసేన కలిస్తే అసలుకే మోసం వస్తుందని సున్నితంగా హెచ్చరించారు. పవన్ కల్యాణ్ కష్టపడుతున్నా...సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల మధ్య కారణంగానే శెట్టిపల్లి రైతులు, ఇళ్ల స్థలాల పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తిరుపతికి సమీపంలో తక్కువ ధరకు వస్తున్నాయని గతంలో పోలీసులు, రెవెన్యూ, మున్సిపాలిటీ ఉద్యోగులు, జర్నలిస్టులు ఇక్కడి భూములు కొనుగోలు చేసి... రిజిస్టర్ చేసుకున్నారని, ఆ భూములను అధికార పార్టీ నేతలు కబ్జాకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే కలెక్టర్, ఆర్డీవో జోక్యం చేసుకొని సమస్యను సున్నితంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ సందర్భంగా పోరాటంలో భాగంగా శెట్టిపల్లి రైతులు తమ ప్రాణాలు సైతం అర్పించారని గుర్తుచేశారు. అనేక పోరాటాల ఫలితంగానే నాడు ప్రతిపక్ష నేతగా జగన్ బాధితులకు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత ఆ విషయం మర్చిపోయారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ శెట్టిపల్లి రైతులు, పేదలకు అండగా ఉంటామన్నారు. ఈ భూములు పేదల సొత్తని, వీటి జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. నారాయణ వెంట సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, విశ్వనాథ్, బి.నదియా, ఉదయ్‌కుమార్, బండి చలపతి, ఎన్డీ రవి, ఎస్ శివ, కేవై రాజా, కె.పద్మనాభ రెడ్డి, సీహెచ్ శివకుమార్, మోహన్‌రెడ్డి, ఎంవీయస్ మూర్తి, జె.నాగరాజు, వై.ఎస్ మణి, భూ బాధితుల సంఘం నాయకులు కృష్ణ, దప్పు సూరి, రాధాకృష్ణ ఉన్నారు.

ఏపీలో 79 లక్షల మంది కార్మికులకు

ఉచిత ప్రమాద బీమా

కేంద్రమంత్రి రామేశ్వర్ తేలీ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో 79,54,498 మంది అసంఘటిత రంగ కార్మికులకు రూ.2 లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ పోర్టల్‌లో 2023 మార్చి27 నాటికి దేశవ్యాప్తంగా నమోదైన 28,78,93,401 మందికి రూ.2 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాజ్యసభలో గురువారం వైసీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం మరో ఏడాదిపాటు పొడిగించే యోచన ఉందా? అన్న మరో ప్రశ్నకు జవా బిస్తూ... ఇన్సూరెన్స్ కవరేజ్ పొడిగించే ప్రతిపాదన ఏదీ లేదని, పోర్టల్‌లో నమోదు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ మొదటి సంవత్సరం మాత్రమే ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో పాటు స్పెషల్ డ్రైవ్‌లు, క్యాంపులు నిర్వహించి, ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ-శ్రమ్ పోర్టల్ ప్రమోషన్ కోసం నిధులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పర్యాటకం ద్వారా రూ.1.34 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం: మంత్రి కిషన్ రెడ్డి

విదేశీ పర్యాటకుల ద్వారా 2022 ఆర్థిక సంవత్సరంలో దేశానికి ఒక లక్షా 34 వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం లభించిందని పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి రాజ్యసభలో ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. 2021 ఆర్థిక సంవత్సరంలో పర్యాటకుల ద్వారా రూ.65 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వచ్చినట్లు చెప్పారు. 2019లో కోవిడ్ ప్రబలడానికి ముందు కోటి మంది విదేశీ పర్యాటకులు దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఇమ్మిగ్రేషన్ బ్యూరో అందించిన తాజా సమాచారం ప్రకారం 2022లో దేశాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకుల సంఖ్య 60 లక్షలు ఉన్నట్లు మంత్రి వివరించారు. కోవిడ్ ప్రభావం తగ్గిన తర్వాత విదేశీ పర్యాటకం గణనీ యంగా పుంజుకుంటోందని మంత్రి వెల్లడిం చారు. విదేశీ పర్యాటకులకు పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన సమాచారం అందించేం దుకు పర్యాటక మంత్రిత్వశాఖ 12 విదేశీ భాషల్లో టూరిస్టు హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. 166 దేశాలకు సంబంధించిన పర్యాటకులకు అయిదు సబ్-కేటగిరీల్లో ఈ వీసా మంజూరు చేసే సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. 1000 నుంచి 7500 రూపాయలు ఉండే హోటల్ గది అద్దెలపై జీఎస్టీని 12 శాతానికి తగ్గించి పర్యాటక ప్రాంతాల్లో వసతి సౌకర్యాల కల్పనకు పోటీని పెంచేందుకు దోహదం చేసినట్లు మంత్రి చెప్పారు. పర్యాటక మంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు 59 టూరిజం రూట్లను వివిధ ఎయిర్‌లైన్స్‌కు కేటాయించినట్లు చెప్పారు. దేశంలో 55 ప్రాంతాల్లో జి 20 సమావేశాలు జరుగుతున్నాయి. పర్యాటకుల కోసం ఈ ప్రదేశాల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తున్నట్లు మంత్రి తెలిపారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర - పార్వతీపురం: ప్రజలపై భారాలువేసే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ కమ్యూనిస్టుల ప్రచారాందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్యక్షతన జిల్లాస్థాయి విస్తృత సమావేశం గురువారం పార్వతీపురం ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై విరుచుకుపడుతూ ప్రశ్నించే వారి గొంతుకులను నొక్కుతున్నదని, రూ.12 లక్షల కోట్ల కుంభకోణం చేసిన అదానీని వెనకవేసుకొస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఇసుక తదితర కుంభకోణాలు చేసి రాష్ట్ర ప్రజల పరిస్థితిని అగాధానికి తీసుకెళ్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా గాని, ప్రత్యేక ప్యాకేజీ కానీ పూర్తిగా మర్చిపోయిన మన ముఖ్యమంత్రి అన్నారు. మోదీ హఠావో దేశ్ బచావో నినాదంతో గ్రామ గ్రామాన పాదయాత్రలు, జీపు జాతలు నిర్వహించాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ, ఆసరా పింఛన్లు, పేద ప్రజలకు అందరికీ ఇవ్వాలని, ప్రతి ఒక్క పేదవానికి ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి షరతులు లేకుండా ఐదు లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవీ నాయుడు, గరుగుబిల్లి సూరయ్య, కూరంగి గోపి నాయుడు, జిల్లా సమితి సభ్యులు సింహాద్రి దుర్గారావు, సాలాపు అనంతరావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బీటీ నాయుడు, సీనియర్ నాయకులు మండంగి సింగన్న, సత్య ప్రసాద్, ఎలగాడ పైడిశెట్టి, గుజ్జ జనార్ధన్, మండంగి గోపాల్, పువ్వల ప్రసాద్, బంగారి, మండంగి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి రబ్బరుడాం సందర్శన: మన్యం జిల్లాలోని కొమరాడ మండలంలో గల జంఝావతి డ్యాంను ఈశ్వరయ్య, కామేశ్వరరావు, మన్మధరావు తదితర సీపీఐ నేతలు సందర్శించారు. ఆసియాలో రికార్డు సాధించిన రబ్బర్ డాంగా పేరుగాంచిన జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో దాని ద్వారా రైతులకు లాభం లేకుండా పోయిందన్నారు. ఒడిశాతో చర్చలు చేస్తామని పాలకులు చెప్పడం తప్ప ఆచరణలో ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా ఒడిశా ప్రభుత్వంతో చర్చించి దీని ద్వారా రైతులకు సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

70 వేల ఎకరాల్లో మామిడి పంట నష్టం

- ప్రభుత్వం ఆదుకోవాలి: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: ఇటీవల సంభవించిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ వర్షాలకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.ఈ నేపథ్యంలో మామిడికాయలు రాలిపోయి ఎకరానికి నాలుగు టన్నులు నష్టం వాటిల్లింది. దీంతో పాటు పూత దశలో త్రిప్స్, కాయ దశలో తాటి మంగు, నల్ల మంగు వంటి పలు చీడపీడలు వ్యాపించి మామిడిరైతులు కుదేలు అయ్యారు. ఎకరానికి రూ.50వేలు పైగానే నష్టపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని అన్నవరం, వెంకటాద్రిపురం, మిట్టగూడెం, లీలానగర్, దిగవల్లి, ముక్కోల్లుపాడు, సిద్ధార్థనగర్ ప్రాంతాలతో పాటు ఆగిరిపల్లి మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో రైతాంగం అత్యధికంగా నష్టపోయినట్లు పరిశీలనలో తేలింది. ఉన్న పంటను మార్కెట్‌కు తీసుకు వెళితే నాణ్యత లేదని కొనకుండా తిరిగి పంపిచేయడంతో కూలీ, రవాణా ఖర్చులు కూడా రావటంతో లేదు. దీంతో మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నష్టపోయిన మామిడి తోటలను ఎన్యూమరేషన్ చేయాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. నూజివీడులో ఉద్యాన శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. మామిడి తోటలను వాతావరణ బీమా పథకంలో చేర్చి బీమా పరిహారం చెల్లించాలని రైతుసంఘం నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కార్యదర్శి పి.జమలయ్య, రైతుసంఘం జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీ యూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, రైతు సంఘం నాయకులు బొమ్మారెడ్డి రమేశ్ రెడ్డి, బి.రంగా, బి.జయశ్రీ, జె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల జీవితాలు దుర్భరం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల చేతివృత్తిదారుల జీవితాలు మరింత దుర్భరమవుతున్నాయని, ఈ విధానాలపై చేతివృత్తిదారులు ఐక్యంగా ఉద్యమించి తమ వృత్తులను పరిరక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. విజయవాడ దాసరిభవన్‌లో చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశంలో జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రెండు జీవోల వల్ల సముద్ర సంపద కనుమరుగై....పర్యావరణం దెబ్బతింటుందని సత్యనారాయణమూర్తి చెప్పారు. విదేశీ టాలర్లకు అనుమతించడం వల్ల సంప్రదాయ మత్స్యకారుల జీవనం పూర్తిగా దెబ్బతింటుందని, దీనికి వ్యతిరేకంగా మత్స్యకారులను ఉద్యమాలకు సన్నద్ధం చేయాలని కోరారు. జాతీయ చేనేత బోర్డును రద్దు చేయాలని, మరమగ్గాలతో చేనేత వస్త్రాలు తయారు చేయడం వల్ల అత్యధికంగా నిల్వలు పేరుకుపోయి చేనేతకార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై విధించిన జీఎస్టీ వల్ల ఆ రంగం పూర్తిగా కుదేలైందన్నారు.

చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ చేతివృత్తులను కాపాడతానని అధికారంలోకి వచ్చిన జగన్... గతంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా కొంతమంది వృత్తిదారులకు కేవలం 10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. చేతివృత్తిదారులను మభ్యపెట్టడానికి 56 కులవృత్తుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండానే ఆ పాలకవర్గ కాలం ముగిసిందని, జగన్ విధానాలపై పోరాటాలకు రూపకల్పన జరుగుతోందని, అందుకే చేతివృత్తిదారుల సమస్యలపై ప్రధానంగా రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జులైలో అనంతపురంలో, చేనేత కార్మికుల సమస్యలపై అన్నిజిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేపడుతున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురౌతున్న గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యలపై, మత్స్యకారుల సమస్యలపై రాష్ట్ర సదస్సులు నిర్వహించి ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, కేవీ కృష్ణగౌడ్, బి.వెంకట్రావు, కె.చైతన్య, పి.నాగాంజనేయులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు పంటనష్టపోయిన

రైతులను ఆదుకోవాలి

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి: కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, వడగండ్ల వానకు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంట నష్టాలను సర్వే చేసి ఈ నెల నాలుగో తేదీ నాటికి నివేదికలు అందిస్తామని చెప్పారనీ, ఇప్పటివరకు ఏ జిల్లాలోనూ పూర్తి సర్వే నివేదిక ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అధికారులు పంట నష్టాల నివేదికను వెంటనే ప్రభుత్వానికి అంద జేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా ఎక్కువ సమయం వెచ్చించకుండా రైతులను ఆదుకోవాలని కోరారు. గతంలో వలే ఎకరాకు రూ.6 వేలు వంతున నామమాత్రంగా కాకుండా పెరిగిన పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు వంతున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల రిపోర్టులు వచ్చిన తర్వాత రైతు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 16.50 లక్షల మంది కౌలు రైతులు ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 5.5 లక్షల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చిందన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన కౌలు రైతుల రాష్ట్రస్థాయి సదస్సులోని తీర్మానాలను అనుసరించి పోరాటాలకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు గ్రామ సభలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్లు అందుకు తగు విధంగా రెవెన్యూ అధికారులను, వ్యవసాయ అధికారులను, గ్రామస్థాయి అధికారులను సన్నద్ధం చేసి గ్రామసభల తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు జూన్ మొదటి వారం నుంచి పంట రుణాలు ఇప్పించేందుకు అధికారుల సిద్ధం కావాలని కోరారు. జిల్లాలోని మెట్ట ప్రాంత వరప్రసాదిని అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిధులు లేని కారణంగా నత్త నడకన నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిస్థాయిలో రూ. 2000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మల్లవరం డ్యాంకు విరిగిపోయిన గేట్లను వెంటనే నిర్మించాలన్నారు. గేట్ల నిర్మాణం లేని కారణంగా నీరంతా సముద్రం పాలవుతోందన్నారు. గేట్లు నిర్మించి ఒంగోలుకు జలాశయం ద్వారా తాగునీరుపాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటల నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో మండల స్థాయి మహాసభలు పూర్తిచేసి, జూన్ నెలలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కె వీరారెడ్డి, బాణాల రామయ్య, నల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

దళితులు, ముస్లింలపై దాడులను అరికట్టండి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో దళిత, ముస్లింలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. గురువారం ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్, ఇన్సాఫ్ అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, ఎస్డీ సర్దార్ అధ్యక్షతన నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న కరవది సుబ్బారావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దళితులపై దాడులు చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా రాజకీయ పదవులు కట్టబెడుతోందన్నారు. ఇంత జరుగుతున్నా ఎస్సీ కమిషన్ నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులను ఓట్ల కోసమే వాడుకుంటున్నారు తప్ప వారి ఎదుగుదలకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తూ... కేవలం సంవత్సరానికి రూ.10వేలు ఇస్తే ఆ కుటుంబాలు ఎలా ముందుకు సాగుతాయని ప్రశ్నించారు. ఉద్యోగ ఉపాధి లేక దళిత కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. రాష్ట్రంలో 27 దళిత పథకాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 11న చలో విజయవాడకు దళిత సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్ మాట్లాడుతూ... దళితులు, మైనార్టీలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నేత దాసరి సుందరం, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నూకతోటి బాబురావు మాట్లాడుతూ... దాడికి ప్రతి దాడి జరిగినప్పుడే దళిత మైనార్టీల జోలికి ఎవరు రారని గతంలో ఎన్నో సంఘటనల ద్వారా రుజువు చేశామని, చట్టం అగ్రవర్ణాలకు చుట్టంగా మారిందని అన్నారు.

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకుడు కరీముల్లా ఖాన్ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ముస్లింలపై దాడులు ఎక్కువయ్యాయని, వారిని భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ఎన్ని అవరోధాలు వచ్చినా ముస్లిం సమాజం భయపడే ప్రసక్తే లేదని అన్నారు. బహుజన రచయితల కన్వీనర్ మిరియం అంజిబాబు మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని పాలకులు సరైన రీతిలో అమలు చేయడం లేదని, కేవలం వారి అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. ఇది లౌకిక గణతంత్ర ప్రజాస్వామ్య దేశం అనే సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ... అంబేద్కర్ చూపిన మార్గంలో దళితులు నడుచుకుంటున్నారని పాలకులు గుర్తించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు కపిల్ బాషా మాట్లాడుతూ... ప్రస్తుత పాలకులు దళిత మైనార్టీలను పూర్తిగా విస్మరించారని, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా వారికోసం అనేక పథకాలను అందించి వారి అభ్యున్నతికి తోడ్పడిందన్నారు. కే ఎన్‌పీఎస్ జిల్లా ఎకో మెంబర్ ఎం.జార్జ్ మాట్లాడుతూ... మనుధర్మ శాస్త్రాన్ని దేశంలో ప్రవేశపెట్టడానికి బీజేపీ తహతహలాడుతోందని, అది జరిగే పని కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జూన్ 4 న ఢిల్లీలో యువ మహిళా ప్రదర్శన

అక్కినేని వనజ, దుర్గాభవానీ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ) 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 4న దేశ రాజధాని ఢిల్లీలో యువ మహిళల భారీ ప్రదర్శన జరగనుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని తెలిపారు. గత ఐదు రోజులుగా ఇక్కడి దాసరి భవన్‌లో నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య రాష్ట్ర స్థాయి సైద్ధాంతిక రాజకీయ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో వనజ మాట్లాడుతూ, మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ బోధనలను ప్రతి కమ్యూనిస్టు అలవర్చుకోవాలన్నారు. మహిళలు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దుర్గాభవానీ మాట్లాడుతూ, అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలను త్వరలో పూర్తిచేసుకుని రాష్ట్ర మహాసభలకు సమాయత్తంకావాలన్నారు. సమావేశంలో సమాఖ్య కోశాధికారి పంచదార్ల దుర్గాంబ, కార్యదర్శి పమిడిముక్కల రాణి, ఉపాధ్యక్షులు పద్మావతి , కే సుజాత తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చివరి రోజు తరగతులలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విప్లవకర పార్టీ ఆవశ్యకత, ప్రజా సంఘాల నిర్మాణం అంశంపై వివరించారు. దేశంలో మహిళా ఉద్యమ చరిత్ర అంశంపై మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు పి.ప్రేంపావని బోధించారు.

సర్దుబాటు ఉపాధ్యాయులకు అలవెన్స్ ఇవ్వాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత పాఠశాలల్లో బోధించుటకు అర్హులను సర్దుబాటు చేస్తూ ఫిబ్రవరిలో పంపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నెలవారీ అదనపు అలవెన్స్ రూ.2500 చెల్లించేందుకుగాను తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాకమిషనర్ సురేశ్‌కుమార్‌కు గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రస్థాయి విద్యాశాఖాధికారులు ఆర్థికశాఖ అనుమతి లేకుండానే ఆఘమేఘాలపై జనవరిలో పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టు కేసుల కారణంగా పదోన్నతులు ఇవ్వలేక సర్దుబాటు పేరుతో అర్హులయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు పంపారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెల వేతనంతో పాటు వారికి అదనంగా రూ.2500 చెల్లించాల్సి ఉందని, ఏ ఒక్క సర్దుబాటు ఉపాధ్యాయుడికీ రూ.2500 అలవెన్స్ చెల్లించలేదని వివరించారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా ఇంతవరకు ఆర్థికశాఖ అనుమతి లేదని తెలిసిందని, అందుకని తక్షణం సర్దుబాటు ఉపాధ్యాయులందరికీ రూ.2500 చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు పొందాల్సిన ఉపాధ్యాయులతో సర్దుబాటు పేరుతో వెట్టిచాకిరీ చేయించుకోవడం విద్యావ్యవస్థకు, సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. లేకుంటే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. వేసవి సెలవులలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిందేమీ లేదు

మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర విజయనగరం: వైసీపీ పనైపోయిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శిస్తున్నారని, ఎవరి పనైపోయిందో ఏడాది కాలంలో ప్రజలే తేలుస్తారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. తమ పార్టీపై చంద్రబాబు అపనిందలతో పాటు వ్యక్తిగత విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమని బొత్స ప్రశ్నించారు. విజయనగరంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రుషికొండను బోడికొండ అని చంద్రబాబు అంటున్నారని, బాధ్యత గల రాజకీయ పార్టీగా, వ్యక్తిగా మాట్లాడాలని, లేకపోతే ప్రజలు హర్షించరని హితవు పలికారు. రుషికొండను అభివృద్ధి చేయడం తప్పా అని మంత్రి బొత్స ప్రశ్నించారు. అక్కడ బొత్స సత్యనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి ఆక్రమణలు చేసి ఇల్లు కట్టడం లేదని, ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతోందని పదేపదే చెబుతున్నామని గుర్తుచేశారు. విశాఖపట్నం అభివృద్ధి చెందకూడదని చంద్రబాబు కోరుకుంటున్నారని, ఉత్తరాంధ్రకు ఆయన చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో విశాఖకు ఐటీ పరిశ్రమలు వచ్చాయన్నారు. ఫార్మాసిటీ కూడా రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాను పరిశ్రమల శాఖమంత్రిగా ఉన్నప్పుడు వచ్చిందని వివరించారు. ఉత్తరాంధ్ర రాజశేఖరరెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ఆయన స్ఫూర్తితో జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. రెండు లక్షల కోట్లు అందించబట్టే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి రాష్ట్ర జీడీపీ పెరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు, ఇద్దరు వైద్యులను నియమిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పులమయంతో సర్వనాశనం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు గ్రామాలకు వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలు నియంత్రించాలని

10న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-గుంటూరు: యువతే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో జరుగుతున్న బూతు పురాణాలు, ఆన్‌లైన్ మోసాలను నియంత్రించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో రోజురోజుకి ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లు, అశ్లీలత, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయన్నారు. నియంత్రించవలసిన ప్రభుత్వాలు కళ్లుండి లేని విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. సోషల్ మీడియా ద్వారా యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని యాప్‌ల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని అటువంటి వాటిని ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, చల్లా మరియదాసు, పల్నాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

'e' Procurement Tender Notice No. 03/2022-23/CE/SE(P-II)/EE(PD-I)/DB/GVMC, Dt:06.04.2023

Tender Notice No.: 03/2022-23/CE/SE(P-II)/EE(PD-I)/DB/GVMC, Dt:06.04.2023
Number of works - 04, Value of works Rs. 1515.27 Lakhs
Tender Opening Dt. 06-04-2023, Closing Date 25-04-2023
Note : Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE- PD-1 Cell No. 9848308824.

For Commissioner

సంపాదకీయం

మానని గాయానికి కొంత ఊరట

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని జి.మాడుగుల మండలంలో కూంబింగ్ కార్యక్రమం కోసం వెళ్లిన ప్రత్యేక దళానికి చెందిన 21 మంది పోలీసులు 11 మంది గిరిజన మహిళలమీద దారుణంగా అత్యాచారం చేశారు. సాధారణంగా అత్యాచారం జరిగినప్పుడు మహిళలు తమ గోడు చెప్పుకోవడానికి, పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రారు. కానీ వాకపల్లి సంఘటనలో బాధిత మహిళలు తమకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేయడమే కాక ఈ కేసు మీద విచారణ మొదలయ్యే దాకా నిరంతరం పోరాడారు. వీరి పోరాటం గురువారం ఒక మేరకు ఫలించింది. ఈ కేసులో నిందితులైన పోలీసులందరినీ న్యాయస్థానం శిక్షించకుండా వదిలేసింది. కానీ వీరు నిర్దోషులని తేలినందువల్ల విడుదల కాలేదు. ఈ కేసులో దర్యాప్తు సరిగా జరగనందువల్ల, నిందితులమీద ఉన్న ఆరోపణలను కచ్చితంగా నిరూపించే అవకాశం లేనందువల్ల వీరిని న్యాయస్థానం వదిలేయవలసి వచ్చింది. అయితే బాధిత మహిళలకు పరిహారం ఇప్పించాలని ఆదేశించింది. 2007 ఆగస్టు 20న గిరిజన మహిళల మీద అత్యాచారం జరిగితే కేసు నమోదు చేయించడం, విచారణ జరిగేట్టు చూడడానికే విశ్వ ప్రయత్నం చేయాల్సి వచ్చింది. బాధిత మహిళల పట్టుదలవల్లే ఇది సాధ్యమైంది. నిందితులకు శిక్షపడి ఉండకపోవచ్చు. కానీ వారు నిర్దోషులని కోర్టు తేల్చలేదు. దర్యాప్తు సరిగా జరగనందువల్లే వారు దోషులుగా తేలలేదని న్యాయస్థానం స్పష్టంగా చెప్పింది. అత్యాచారం జరిగిన 11 ఏళ్లకు హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ సుదీర్ఘ న్యాయపోరాటం చేసిన తరవాత విశాఖపట్నంలో 2018లో విచారణ మొదలైంది. నాలుగేళ్ల పాటు విచారణ జరిగిన తరవాత గురువారం 11వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో దర్యాప్తే నిందితులను కాపాడే దురుద్దేశంతో జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. నిందితులకు శిక్ష పడకపోయినా వారికి జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారంటే వారి వాంగ్మూలాలను న్యాయస్థానం విశ్వసించినట్టే. ఈ కేసును దర్యాప్తు చేసిన ఇద్దరు పోలీసు అధికారులు నిష్పాక్షికంగా, న్యాయంగా దర్యాప్తు చేయలేదని న్యాయమూర్తి అరమరికలు లేకుండానే తేల్చేశారు. దర్యాప్తు అధికారుల్లో ఒకరైన ఆనందరావు మరణించారు. రెండవ దర్యాప్తు అధికారి శివానందరెడ్డి చేసిన దర్యాప్తు ఏ మాత్రం పొందికగా లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆయన సవ్యంగా దర్యాప్తు చేసి ఉంటే నిందితులకు శిక్ష పడేదేమో. ఆయన సవ్యంగా దర్యాప్తు చేయలేదు కనక ఈ వ్యవహారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అపెక్స్ కమిటీకి నివేదించాలని కూడా ఆదేశించారు.

ఈ కేసులో మొదటి నుంచీ దర్యాప్తు క్రమంలో రాజీ పడ్డారని ఆదివాసీ మహిళా సంఘాలవారు, మానవ హక్కుల సంఘాల వారు వాదిస్తూనే వచ్చారు. దర్యాప్తు మొదలు పెట్టిన మొదటి రోజునుంచీ దర్యాప్తు చేసిన గిరిజన మహిళలపై అత్యాచారం చేశారన్న తీవ్ర ఆరోపణలను ఎదుర్కుంటున్న తమ తోటి పోలీసు అధికారులను ఎలా కాపాడాలా అనే ప్రయత్నించారు. నేర శిక్షా స్మృతి ప్రకారం దర్యాప్తుకు అనుసరించవలసిన ఏ సూత్రాన్నీ పాటించలేదు. ఈ మహిళల మీద అత్యాచారం జరిగిందో లేదో నిర్ధారించడానికి ఉపకరించే ఫోరెన్సిక్ పరీక్షా ప్రక్రియ కూడా అడ్డదిడ్డంగానే సాగింది. బాధితుల్లో ఇద్దరు గిరిజన మహిళలు ఇదివరకే మరణించారు. నిందితులైన మహిళలు న్యాయం కోసం దృఢంగా నిలబడి ఇన్నేళ్లుగా పోరాడి ఉండకపోతే ఈ మాత్రం న్యాయమైనా జరిగి ఉండేది కాదు. ఈ మహిళలు గిరిజనులే కాక నిరక్షరాస్యులు. అయిన వారు ధైర్యంచేసి న్యాయ పోరాటం కొనసాగిస్తూనే వచ్చారు.

ఈ క్రమంలో అనేక అవమానాలు భరించవలసి వచ్చింది. న్యాయ స్థానంలో విచారణ సందర్భంగా వారిని ప్రశ్నలడిగిన భాష కూడా ఆ మహిళలకు తెలియదు. వీరి మీద జరిగిన మూకుమ్మడి అత్యాచారం మానవతను మంటగలిపింది. పైగా చేసిన తప్పు కప్పి పుచ్చుకోవడానికి పోలీసులు నానా అడ్డదార్లూ తొక్కారు. నక్సలైట్ల ప్రభావం ఉందనుకునే ప్రాంతాలలో నక్సలైట్లను ఏరివేసే మహత్కార్యంలో పాలు పంచుకునే గ్రే హౌండ్స్ లాంటి ప్రత్యేక పోలీసు దళాల వారి ప్రవర్తన, పాల్పడే అఘాయిత్యాలు కూడా చాలా ప్రత్యేకంగానే ఉంటాయి. బాధితుల్లో ఒక మహిళ పాముకాటువల్ల మరో మహిళ మలేరియా వ్యాధి వల్ల మరణించారు. ఎంతమంది వారి పోరాటాన్ని ఎద్దేవా చేసినా మిగతా తొమ్మిది మంది మహిళలు 16 ఏళ్లుగా మొక్కవోని ధైర్యంతో అన్యాయాన్ని ఎదిరించడానికి కట్టుబడి ఉన్నందువల్లే పాక్షిక విజయమైనా సాధించగలిగారు. అత్యాచారం జరిగిన వెంటనే ఈ మహిళలు గ్రామ పెద్ద, ఆదివాసీల హక్కుల పరిరక్షణకోసం పాటు పడే స్వచ్ఛంద సంస్థల సహాయంతో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసినప్పటి నుంచి ఏళ్ల తరబడి ఈ మహిళలు ప్రతి రోజూ ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగానే జీవనం గడపవలసి వచ్చింది. మొదట్లో సీఐడి దర్యాప్తు ఫలితం అత్యాచారం చేసిన వారికి అనుకూలంగానే వచ్చింది. బాధితులంటున్న వారికి వైద్య పరీక్షలే జరగలేదని అన్నారు. అందువల్ల హైకోర్టు వారి అర్జీని తోసిపుచ్చింది. ఆ తరవాత ఈ మహిళలు 2008 ఏప్రిల్‌లో పాడేరు మండలంలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నిరసనగా మరో పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ నివేదికను తోసిపుచ్చి తాజాగా దర్యాప్తు చేయించాలని ఈ పిటిషన్‌లో కోరారు. వారం రోజుల్లో హైకోర్టు వారి మొర ఆలకించగానే నిందితులు హైకోర్టుకెళ్లి దర్యాప్తును నిలిపి వేయించాలని అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

ఏప్రిల్ 2012లో 21 మంది నిందితుల్లో 13 మంది మీద దర్యాప్తు చేయవచ్చునని భావించింది. వెంటనే నిందితులు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంవల్ల విచారణ మరో నాలుగేళ్లుఆగింది. పదేళ్లుగా ఈ కేసు కొనసాగడం ఆశ్చర్యకరంగా ఉందని భావించిన సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్ లో నిందితులు పెట్టుకున్న పిటిషన్‌ను తోసిపుచ్చింది. ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి విచారణ త్వరగా పూర్తి చేయాలని కూడా ఆదేశించింది. అప్పుడు విచారణ బాధ్యతను విశాఖపట్నం ప్రత్యేక కోర్టుకు అప్పగించారు. తమకు నచ్చిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించడంకోసం కూడా బాధితులు మళ్లీ హైకోర్టు మెట్లెక్కవలసి వచ్చింది. 2018 జనవరిలో హైకోర్టు పల్లా త్రినాథ రావును పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించింది. అయితే మరో కేసుకు సంబంధించి త్రినాథ రావును అరెస్టు చేశారు. అప్పుడు విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్‌ను ఆ స్థానంలో నియమించారు. పోలీసులు, ప్రభుత్వం బాధితులైన గిరిజన మహిళలను బెదిరించి, వేధించినా వారు ధైర్యం విడనాడలేదు. తాము ఇచ్చిన వాంగ్మూలానికి తుదికంటా కట్టుబడి ఉన్నారు. బాధితుల గాయం ఎన్నటికీ మానేది కాదు. పైగా నిందితులకు శిక్ష అయినా పడలేదు. కానీ పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించినందువల్ల కొంత ఊరట అయినా మిగిలింది.

మార్పురావాలి

రా బావ ఏంటి ఏదో పాటపాడుతూ వస్తున్నావు. పార్వతి మీ అన్నయ్యవచ్చాడు కాఫీ వేడిగా పట్టుకురా. కాఫీ తాగే వచ్చాను బావ. ఫరవాలేదు. మరోసారి తాగు ఏం కాదు. నీకు గ్యాసు ప్రాబ్లమ్ లేదుగ. సరే ఇప్పుడు చెప్పు మారాలి అంటూ పాడుతున్నావు మళ్లీ ఎక్కడ విన్నావ్ ఈ పాట. ఒక చోట ఏమిటిబావ ఏ రాజకీయపార్టీ మీటింగు పెట్టినా ఇదే పాట. మారాలి మారాలి ప్రజలంతా మారాలి. ప్రజలంతా సొంతంగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించాలనే పాట. అసలు మారాలనే నాయకుడు మారడు కాని ప్రజలంతా మారి ఆయన చెప్పినట్లు చేయాలి. ఏంటి నే చెబుతుంటే నవ్వుతావు. చూడు అసలు ప్రాథమికంగా మనిషి ఆలోచనా విధానం మారాలి. నాయకుణ్ని గుడ్డిగా అనుసరించి ఆచరించకుండా స్వంతంగా ఆలోచించాలి. ప్రస్తుతం నాయకులలో స్వార్థం పెరిగిపోయింది. స్వార్థ పరుడైన నాయకుడు తన సంపాదనకోసం వెనుక నమ్ముకున్న ప్రజల్ని, అనుయాయుల్ని నట్టేట ముంచుతున్నాడు. ఒక రకంగా సమాజానికి ద్రోహం చేస్తున్నాడు. స్వార్థంతో పార్టీలు మార్చేస్తున్నారు. పార్టీని నమ్మి ఓటేసిన ప్రజల్ని మోసంచేసి మరో పార్టీ కండువా కప్పుకొని నిస్సిగ్గుగా దర్జాగా ఉంటున్నాడు. అందుకే తరచూ పార్టీలుమారి మరీ మొహం మీద

నవ్వు పులుముకొని ప్రజలవద్దకు వస్తున్నాడు అందుకే నాయకులు ఎలాగో స్వార్థంతో మారుతున్నారు కనుక ప్రజల ఆలోచనావిధానంలో మార్పురావాలి. పార్టీలు మ్యానిఫెస్టో ఎవరికి వారు అధ్యయనం చేయాలి. ఇచ్చిన వాగ్దానాలు అమలు పరచని పార్టీని బహిష్కరించాలి. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారంకోసం ప్రజలమధ్య తిరుగుతూ వాటిని పరిష్కరించే వ్యక్తినే ఎన్నుకోవాలి. ఎన్నికల తేదీ ప్రకటించిన తరువాతే ప్రజల ముఖం చూచే నాయకుణ్ని రానీయకుండా తిరగబడాలి. అటువంటి చైతన్యం ప్రజల్లో రావాలి. అది సరే అటువంటి మంచి నాయకులు అధికారులలో ఉండటంలేదు గద. బావ మనం చేసే తప్పు అదే. ఎన్నికల రోజున రెండువేలు తీసుకుని ఓటువేసిన తరువాత మన సమస్యల్ని పరిష్కరించమని వాడిని అడిగేందుకు జంకుతున్నాం. ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజలకోసం పనికివచ్చేవాటిని ఆలోచించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. వర్గ విభజనతో కూడుకున్న సమాజంలో లేనివారికి పనికివచ్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉన్న వాడికి కోపం. నిజం చెప్పాలంటే గత 75 ఏళ్లగా ప్రభుత్వాలు ఉన్నవాడికే మేలు చేకూర్చాయి. అంతెందుకు ప్రస్తుతం పేదలు చదివే పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు బాగుచేసినా ఉన్న వాడికి కోపం వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల యజమానులు గుర్రుగా ఉన్నారు. అంతేకాదు బావ ఒకనాడు మాలపల్లి నవలరాసిన ఉన్నవ వారిని బహిష్కరించాలని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారని ఆనాటి ఛాందసవాదులు ఆయన్ని తిట్టేవారు. ప్రస్తుతం ఆ ఆచారాలు అటకెక్కినా ఇప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ వారు మనువాదాన్ని ప్రచారం చేస్తున్నారు. లేనివాడు సంపాదిస్తే ఉన్నవాడికి అసూయ. డబ్బంతా వాడి ఇంట్లోనే ఉండాలి. అందుకే ప్రపంచంలోని సొమ్మంతా ఒక శాతం వారి వద్దే పేరుకుపోతోంది. అందుకే కమ్యూనిజం అంటే గిట్టదు. కమ్యూనిజం అవుట్‌డేటెడ్ అని మను సిద్ధాంతం వల్లెవేసే బీజేపీవారు అసలైన సమసమాజ నిర్మాతలం మేమే అంటున్నారు. అది సరే అసలు మార్చే వాడెవరు? మారవలసింది ఎవరో నా కర్థంకావడంలేదు. ఆర్థికంగా లేనివాళ్లు చదువులేని వాడు మారాలా లేక అన్నీ ఉండి దానికితోడు అధికారం కూడా ఉండి తప్పుచేసేవాడు మారాలా? లేనివాడు డబ్బు కక్కుర్తితో ఓటు అమ్ముకుంటుంటే అధికారంలో ఉన్నవాడు సంపాదించింది చాలక స్వార్థంతో ప్రజాధనం లూటీ చేస్తుంటే ఎవరు మారాలి. నిజమే అసలు వ్యవస్థే కుళ్లిపోయింది. మొత్తం వ్యవస్థే సమూలంగ మారాలి. అది నిజమే అలా సమాజాన్ని నిస్వార్థంతో మార్చడానికి ప్రయత్నిస్తున్న రచయితలు, సంస్కర్తలను అడ్డగోలుగ చంపుతున్నారు కద. ఈ పరిస్థితుల్లో ఇంకెవరు ముందుకొస్తారు. నిజమేఎవరు లేరని కృంగిపోవద్దు. 60 సంవత్సరాలు వెనక్కు వెడితే రాత్రి పాఠశాలలు నడిపి పనిచేసుకుని బతికేవారిని కూడా చదివించి తద్వారా పత్రికలు చదివించిన కమ్యూనిస్టులు ఎంతో చైతన్యం తెచ్చారు. అందుకే 1952లో కేంద్రంలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా నిలబడింది. 1955లో ఆంధ్రాలో కమ్యూనిస్టు ప్రభుత్వం వస్తుందని ఊహించారు. కొన్ని సడలింపులవల్ల ప్రజలు వారికి దూరమయ్యారు. ఇప్పటికైనా సామాన్యుల నివాసాలకు వెళ్లి జరుగుతున్న అన్యాయం వివరిస్తే ప్రజలు తప్పక వింటారు. ఆ రకంగా సామాన్యప్రజల్లో చైతన్యం తేవటం పెద్దకష్టమేమీ కాదు. అందుకు సరైన కార్యాచరణ ఏర్పాటు చేసుకుని పనిచేస్తే చైతన్యవంతులవుతారు.

వ్యాస రచయిత సెల్: 9885569394

రైతు ఉద్యమ యోధ కొల్లి నాగేశ్వరరావు

రైతు ఉద్యమాలు ఊపిరిగా పోరుసలిపిన, కమ్యూనిస్టుపార్టీకి అంకితమై పనిచేసిన నాయకుడు కొల్లి నాగేశ్వరరావు 1937 ఏప్రిల్ 7వ తేదీన కృష్ణాజిల్లా, నూజివీడు తాలూకా గుల్లపూరి శివారు గుడిపాడు గ్రామంలో జన్మించారు. విద్యార్థి దశలో ఆయన అనేక ఉద్యమాలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై, రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం జరిపారు. రైతాంగాన్ని నట్టేట ముంచుతున్న విత్తన సంస్థపై సుప్రీంకోర్టులో పోరాటం సలిపారు. భార్యని, సంతానాన్ని వామపక్ష భావాల వైపు నడిపించిన నాయకుడు కొల్లి నాగేశ్వరరావు. తల్లి రమణమ్మ, తండ్రి వెంకయ్య. వ్యవసాయ కుటుంబం. నాగేశ్వరరావు తనకు ఊహ తెలిసినప్పటి నుంచి వ్యవసాయంలోని ఒడిదుడుకులు, రైతాంగ సమస్యలు, వారు పడుతున్న కష్టాలు, కడగండ్లు గమనిస్తూ ఉండేవారు. అన్నదాతగా కీర్తిపొందిన రైతన్న ఎదుర్కొంటున్న కష్ట, నష్టాలను ఆకళింపు చేసుకున్నారు. వాటి నుంచి అన్నదాత బయట పడే మార్గాలు ఏమిటి? అని ఆలోచిస్తూనే చదువు సాగించేవారని వారి సన్నిహితులు చెపుతారు. ప్రాథమిక విద్యను గుడిపాడులో, ప్రాథమికోన్నత విద్యను నూజివీడులో, డిగ్రీ విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో చదివారు. అటు తర్వాత బీహారు రాష్ట్రంలోని భాగల్పూర్ విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేటుగా పరీక్ష రాసి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు.

జన్మస్థలమైన గుడిపాడు గ్రామం కమ్యూనిస్టు పార్టీ ప్రభావంలో వుండేది. 1942లోనే ఆ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పడిందని చెపుతారు. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ బాలల కోసం ఒక సంఘం ఏర్పాటు చేసింది. అప్పటికి నాగేశ్వరరావుకు నాలుగేళ్లు. బాలల సంఘం కార్యక్రమాలలో పాల్గొన్నారు. బాలల సంఘం నిర్వాహకులు సమాజ శ్రేయస్సును కోరిన వారు కావటంతో నాగేశ్వరరావుకు తల్లిదండ్రులు అడ్డు చెప్పేవారు కారు. హైస్కూలు చదువు నాటికి ఏఐఎస్ఎఫ్ వైపు దృష్టి సారించారు. విజయవాడ కళాశాలలో చదువుతున్న కాలంలో విజయవాడ నగర ఏఐఎస్ఎఫ్ బాధ్యతలు చేపట్టారు. అటు తర్వాత కృష్ణాజిల్లా ఏఐఎస్ఎఫ్ బాధ్యతలు, ఆ పైన ఆంధ్రప్రదేశ్ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. 1965లో కృష్ణాజిల్లా యువజన సమాఖ్య కార్యదర్శిగా నియమితులై, విద్యార్థులను, యువతరాన్ని అభ్యుదయ మార్గంలో నడిపించే ప్రయత్నం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకత్వం దృష్టిలో పడిన నాగేశ్వరరావు 1967లో విజయవాడ నగర సీపీఐ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1968లో సీపీఐ విజయవాడ నగర తాత్కాలిక కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1974 నాటికి పార్టీలో ప్రమోషన్ అందుకున్నారు. ఆ ఏడాది సీపీఐ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులై, 1991 వరకూ పార్టీ విస్తరణ కార్యక్రమాల్లో నిర్విరామంగా కృషిచేశారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూనే, బాల్యం నుంచి వ్యవసాయంలోని ఒడిదుడుకులను ఆకళింపు చేసుకున్నారు కాబట్టే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కూడా శ్రమించేవారు. 1992లో నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 2003 వరకూ కొనసాగారు. 1998లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికై 2003 వరకూ కొనసాగారు. ఆ తర్వాత సీపీఐ జాతీయసమితి సభ్యులై 2005 వరకూ కొనసాగారు. 2003 నుండి 2006 వరకూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులుగా గురుతర బాధ్యతలు నిర్వర్తించారు. 2003లోనే అఖిలభారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

కొల్లి నాగేశ్వరరావు

పార్టీ కార్యక్రమాలకే పరిమితంకాకుండా ప్రజాహిత కార్యక్రమాల్లో కూడా విరివిగా పాల్గొనేవారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరాహారదీక్ష ప్రారంభించి ప్రాణాలు విడిచిన పొట్టి శ్రీరాములు తర్వాత అదే బాటలో ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1966లో మొదలైన 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' ఉద్యమానికి కన్వీనరుగా బాధ్యతలు నిర్వహించారు. 1986లో కృష్ణా జిల్లాలో మిగులు భూములు, బంజరు భూములు పంపిణీకై ఏర్పాటైన కమిటీ కన్వీనరుగా పనిచేశారు. ప్రపంచమే వ్యవసాయం మీద ఆధారపడి వుంది. ప్రతి మనిషి రైతు పండించే ఆహారమే తినాలి, బతకాలి. అలాంటి రైతుకు మేలుజాతి విత్తనాలు అవసరమని ప్రపంచ పరిశోధకులంతా విశ్వసిస్తున్నారు. అంతర్జాతీయంగా విత్తన పంపిణీ చేస్తున్న 'మోన్ శాంటో' అనే విత్తనసంస్థ నాసిరకం విత్తనాలను సరఫరాచేసి, వ్యవసాయ దిగుబడులు తగ్గించి, రైతాంగాన్ని నష్టపరుస్తున్న విషయాన్ని గ్రహించిన నాగేశ్వరరావు, ఆ సంస్థపై సుప్రీంకోర్టులో దావావేసి రైతులపక్షాన సుదీర్ఘపోరాటం జరిపారు.

1998లో రాష్ట్ర వ్యాపితంగా పర్యటనలు నిర్వహించారు. రాష్ట్రంలో విరివిగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యల నుంచి రైతుల్ని దారి మళ్లించే ప్రయత్నంలో భాగంగా 1998 మే, జూన్ నెలల్లో రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించారు. దానికి 'రైతాంగ సమర శంఖం' అని పేరుకూడా పెట్టారు. 1998-99ల్లో తెలంగాణకు గోదావరి జలాల వినియోగ ఉద్యమం నిర్వహించారు. ఈ సమస్య పరిష్కారానికి 1999 మార్చి 22న హైదరాబాదు శాసనసభ వద్ద నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. మార్చి 24న ఈ విషయంపై శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానం ఆమోదం తెలిపే వరకూ కొనసాగించారు.

1962లో హెల్సింకీలో జరిగిన ప్రపంచ యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రపంచ యువజన మహాసభలో పాల్గొనటానికి రష్యా వెళ్లి వచ్చారు. 1973లో నాగేశ్వరరావు చెకొస్లొవేకియాలో పర్యటించారు. 1993, 1995లో 'ప్రపంచ వాణిజ్య సంస్థ-ప్రజల అప్రమతలు' అనే పుస్తకం వెలువరించారు. 2001లో 'ప్రపంచ వాణిజ్య సంస్థ-రైతాంగం రక్షణలు', 2003లో 'బచావత్ అవార్డు-కృష్ణా గోదావరి జలాల వినియోగ వివాదాల పరిష్కారం', 2005లో 'ఆంధ్రప్రదేశ్ జలదర్శిని', 2006లో 'తెలంగాణకు గోదావరి జలాల వినియోగం' లాంటి అతి విలువైన రచనలు వెలువరించారు. ఇవేకాక, వ్యవసాయానికి సహకారం అందించే ఇరిగేషన్ ప్రాజెక్టులు, వ్యవసాయ సమస్యలు, డబ్ల్యూటీఓపై అతి విలువైన వ్యాసాలు రాశారు. వాటిని విశాలాంధ్ర దినపత్రిక క్రమం తప్పకుండా ముద్రించేది. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం 'రైతులోకం' మాసపత్రిక సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

1961 నాటికే సీపీఐ సభ్యులైన టాన్యాను వివాహమాడారు. పెద్ద కుమార్తె ప్రగతి, చిన్న కుమార్తె ప్రశాంతిలే కాక ఆయన మనుమలు. మనుమరాళ్లు కూడా మార్క్సిజం, లెనినిజం, సోషలిజంపై విశ్వాసం కలిగి ఉన్నారు. ఉద్యమాలకే తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన కొల్లి నాగేశ్వరరావు 2020 మే 20న కన్నుమూశారు.

దాసరి ఆళ్వారస్వామి, చరవాణి: 93939818199

ఆరోగ్య కార్యకర్తల తీవ్ర కొరత

డా. జ్ఞాన్ పాఠక్

భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య కార్యకర్తల కొరత తీవ్రంగా ఉంటుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) తాజాగా హెచ్చరించింది. 2030నాటికి ఆరోగ్య కార్యకర్తల కొరత ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కోటిమందికిపైగా కొరత ఏర్పడవచ్చునని ఆ సంస్థ తెలిపింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో వైద్యులు, నర్సులు ఇతర కార్యకర్తల కొరత తీవ్రంగా ఉంటుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. ఈ సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ చెబ్రియేసిస్ మాట్లాడుతూ, ఆరోగ్య కార్యకర్తల రక్షణ, వారికి తోడ్పాటు సంఖ్యను పెంచడం అత్యవసరమని అన్నారు. 2020లో కొవిడ్ మహమ్మారి తలెత్తిన నాటినుంచి ప్రతి ముగ్గురి ఆరోగ్యకార్యకర్తలలో ఒకరు తీవ్రమైన ఆందోళనకు, వ్యాకులతకులోనై ఎంతో బాధపడ్డారని తెలిపారు. కరోనా సమయంలో రోగులకు చికిత్సఅందించడంలో ఆరోగ్య కార్యకర్తలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని అన్నారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఆరోగ్య వ్యవస్థలో మానవ వనరులపై ప్రపంచవేదిక ఐదవసమావేశంలో టెడ్రోస్ ప్రసంగించారు. ఈ సమావేశం ఏప్రిల్ 3-5 తేదీలలో జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్యనిపుణులు, ఆరోగ్య విధానరూపకర్తలు ఇంకా వివిధరంగాల నుండి ఆరోగ్య వ్యవస్థలో పనిచేసేవారు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. "ఆరోగ్య కార్యకర్తల భద్రత, రక్షణ, ఆరోగ్యరంగంలో పెట్టుబడులు" అనే అంశంపై ఈ సమావేశంలో లోతుగా చర్చించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన గడువు 2030నాటికి ముగుస్తుంది. ఈలోపు 2030నాటికి అవసరమైన వైద్యులు, ఇతర నిపుణులు, ఆరోగ్య కార్యకర్తలు ఇతర సహాయకులు ఎంతమంది అవసరమవుతారనే అంశంపై కేంద్రీకరించారు. ఆరోగ్య సంక్షోభాన్ని నివారించేందుకుగాను ప్రపంచ ఆరోగ్యసంస్థ అనేక సూచనలు చేసింది.

సంవత్సరానికి 8-12శాతం డిగ్రీ పొందిన ఆరోగ్యసిబ్బందిని ఆయాదేశాలు తయారు చేసుకోవాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ కోరింది. ఉదాహరణకు ఒక దేశానికి మొత్తం 5000 మంది ఫిజీషియన్లు అవసర మైతే, సంవత్సరానికి 400-600 మంది ఫిజీషియన్లను తయారు చేసుకోవాలని ఆ సంస్థ సూచించింది. ఆరోగ్య కార్యకర్తల విభాగం డైరెక్టర్ జిమ్ కాంప్‌బెల్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య భద్రత అవసరమని భావించినప్పుడు అన్నిదేశాలలో ఆరోగ్య పరిరక్షణ, చికిత్సలో సమానత్వం అవసరమని అన్నారు. నిపుణులను తయారుచేసుకునేందుకు ఇప్పట్నించే తగినచర్యలు తీసుకోవాలని, అవసరమైన ఆర్థికవనరులు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరికలు, సూచనల నేపథ్యంలో భారతదేశం ఈ విషయంపై గట్టిగా ఆలోచించి ఆరోగ్య నిపుణులను, కార్యకర్తలను తయారు చేసుకోవలసి ఉంది. ఇప్పటికే నర్సులు, వైద్యులకొరత తీవ్రంగాఉంది. ఆరోగ్యబీమా ఇంకా ఇతర పథకాలు ఉన్నాయని గొప్పలు చెప్పుకోకుండా ఆరోగ్య నిపుణులను, కార్యకర్తలను తయారు చేసుకోవలసిన అవసరం ఎంతైనాఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఎయిమ్స్ ఆసుపత్రులలో 3,000మందికిపైగా వైద్యుల కొరత ఉంది. ఇంకా అనేక ఆసుపత్రులలో చాలా ఖాళీలు భర్తీ చేయకుండా ఉన్నాయి.

పౌరసమాజ మౌనం ప్రమాదకరం

భారతదేశం 'ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం' అనే లేబుల్‌ను చాలా కాలంగా ఆస్వాదిస్తోంది. ఈ లేబుల్ ఎల్లప్పుడూ బలానికి మూలంగా ఉంది, తరచు అంతర్జాతీయ సంస్థల సభ్యుల నుంచి ప్రశంసలు, గౌరవాన్ని పొందుతుంది. అయితే ఇటీవల పరిణామాలు భారతదేశ ప్రజాస్వామ్య ఖ్యాతిని విదేశాంగ విధాన ఆశయాలను అంతర్జాతీయంగా నీరుగారుస్తున్నారు.

భారతదేశంలో పెరుగుతున్న నిశ్శబ్ద మధ్యతరగతి, నిశ్శబ్ద ప్రతిపక్షం, నిశ్శబ్ద పత్రికలు ప్రమాదకర పరిణామాలు. నిశ్శబ్ద వాతావరణం దళితులు, మైనార్టీలు, సామాన్య ప్రజలకు, పేదలకు మొత్తంగా దేశానికి క్షేమదాయకంకాదు. ద్వేషం, హింస, కష్టాలు, అసమానతలను, బాధలను ప్రోత్సహిస్తుంది. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆకాంక్షలు నెరవేరకపోవడానికి ఇది కారణం కావచ్చు. నియంతృత్వ లక్ష్యాలతో దుష్ట రాజకీయ, మతపరమైన ఎజెండాతో పరిపాలన సాగించినప్పుడు మౌనం మంచిదికాదు. మతం లేదా మతోన్మాద జాతీయ వాదం పేరుతో హింసకు పాల్పడే వారికి పాలక నాయకత్వ నిశ్శబ్దం పచ్చజెండాగా భావించవలసివస్తోంది. భారతదేశంలో ప్రజాస్వామ్యానికి మౌనం ప్రాణాంతకం. 2021లో రాజకీయ ప్రేరేపిత ప్రాసిక్యూషన్‌లను ఉపయోగించి కార్యకర్తలు, జర్నలిస్టులు ప్రభుత్వంపై ఇతర విమర్శకులపై భారత పాలకులు అణిచివేతను తీవ్రతరం చేశారు, హ్యూమన్ రైట్స్ వాచ్ తన వరల్డ్ రిపోర్ట్ 2022లో స్పష్టంగా పేర్కొంది. కోవిడ్ -19 కేసుల పెరుగుదల సమయంలో లక్షలమంది మరణించారు. అవసరమైన వారికి తగిన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. క్రూరమైన ఉగ్రవాద నిరోధకచట్టం, పన్నుదాడులు, విదేశీ నిధుల నిబంధనలు, ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలతో అసమ్మతిని అణచివేశారు. బీజేపీ నేతృత్వంలోని హిందూ జాతీయవాద ప్రభుత్వంలో మతపరమైన మైనార్టీలపై దాడులుచేసినవారికి శిక్షలు లేవు. బిజెపి మద్దతుదారులు మూకుమ్మడి దాడులకు పాల్పడ్డారు, హింసను ప్రేరేపించారు. అయితే అనేక రాష్ట్రాలు మైనారిటీ వర్గాలను, ముఖ్యంగా క్రైస్తవులు, ముస్లింలు, దళితులు, ఆదివాసీల లక్ష్యంగా చేసుకోవడానికి చట్టాలను దుర్వినియోగం చేశారు. భారత అధికారులు భిన్నాభిప్రాయాలు గలవారిని విడిచిపెట్టలేదు, విమర్శకుల నిశ్శబ్దంకోసం రాష్ట్ర యంత్రాంగాన్ని ఉపయోగిస్తారు అని హ్యూమన్‌రైట్స్ వాచ్ దక్షిణాసియా డైరెక్టర్ మీనాక్షి గంగూలీ అన్నారు. బిజెపి ప్రభుత్వం మైనారిటీలు అసురక్షితంగా భావించే

వాతావరణాన్ని సృష్టించింది. హ్యూమన్ రైట్స్ వాచ్ దాదాపు వంద దేశాలు మానవ హక్కుల పద్ధతులు సమీక్షించింది. జైల్లో ఉన్న 84ఏళ్ల గిరిజన హక్కుల కార్యకర్త స్టాన్‌స్వామి మరణించడం హక్కుల కార్యకర్తలపై జరుగుతున్న హింసకు ప్రతీక.

2017లో మహారాష్ట్రలో జరిగిన కులహింస ఘటనకు సంబంధించి రాజకీయ ప్రేరేపిత ఉగ్రవాద ఆరోపణలపై అరెస్టయిన 16 మంది ప్రముఖ మానవహక్కుల రక్షకుల్లో స్వామి కూడా ఉన్నారు. త్రిపురలో పోలీసులు నలుగురు న్యాయవాదులపై అక్టోబరులో మతహింసపై నిజనిర్ధారణ విచారణ జరిపేందుకు తీవ్రవాద కేసులను నమోదు చేశారు. ఇందులో హిందూ గుంపులు మసీదులు, ముస్లింల ఆస్తులపై దాడిచేశారు. 2002 గుజరాత్ మతపరమైన అల్లర్ల సమయంలో బిల్కిస్‌బానో అనే ముస్లింమహిళపై సామూహిక అత్యాచారంచేసి, ఆమె కుటుంబ సభ్యులను హత్యచేసిన కేసులో దోషులుగా తేలి యావజ్జీవ కారాగారశిక్షపడిన 11 మందిని గత ఆగస్టులో గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. 102 సోషల్ మీడియా ఖాతాలపై తీవ్రవాద కేసులు నమోదు చేశారు. అలాగే హింసపై నివేదించిన ఇద్దరు జర్నలిస్టులను "మత హింసను వ్యాప్తి చేస్తున్నారు" అనే ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. ముస్లింలపై వివక్షచూపే పౌరసత్వచట్ట సవరణలను నిరసించినవారిపై తీవ్రవాద నిరోధక, దేశద్రోహ చట్టాలు ఇంకా అనేక మంది విద్యార్థులు, కార్యకర్తలపై నమోదుచేశారు. మూడు వ్యవసాయ చట్టాల రద్దుకోరుతూ మహోత్తర ఉద్యమంచేసిన రైతులు, మైనారిటీ సిక్కు కమ్యూనిటీకి చెందిన చాలామంది వేర్పాటువాద ఎజెండాను కలిగి ఉన్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ వివిధ శాంతియుత నిరసనల్లో పాల్గొనే వ్యక్తులను "పరాన్నజీవులు"గా అభివర్ణించారు. భారత రాజ్యాంగాన్ని దానిలో పొందుపరచిన స్వేచ్ఛలను హరిస్తున్నారు. పౌరనియమాలు, నిబంధనలను ఉల్లంఘిస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి తహతహలాడుతున్నారు. వీరికి సమాంతర శక్తులు ఎటువంటి కార్యనిర్వాహక లేదా చట్టబద్ధమైన అధికారం లేకుండా, శిక్షలు లేకుండా వీధుల్లో పాలన సాగిస్తున్నాయి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హుడ్నిచేసి రాక్షసానందం పొందుతున్నారు. సామాన్య మదుపరుల డబ్బు లక్షల కోట్లు ఆవిరవుతున్నా, దానికి కారణమైన అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయకుండా కార్పొరేట్ ఎగవేతదారులకు రక్షణగా నిలుస్తున్నారు.

భారత ప్రజాస్వామ్యం గత దశాబ్దకాలంగా కల్లోల పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇది నిస్సందేహంగా దేశంలోని మీడియాపై ప్రభావం చూపింది. మీడియా పరిస్థితి గురించి అర్థవంతమైన చర్చలు లేకపోవడం గత దశాబ్దకాలంగా కొనసాగుతోంది. మీడియా స్వేచ్ఛపై పౌరసమాజం మౌనం వహించడం భారతదేశంవంటి ప్రజాస్వామ్యంలో మీడియా పోషించగల పాత్ర అర్థరహితమైంది. మీడియా రాజకీయపక్షపాతం లేదా స్వతంత్రంగా పనిచేయలేకపోతోంది. ప్రభుత్వం అనుకూలంగా ప్రధాన మీడియా పనిచేస్తోంది. తీవ్ర రాజకీయ పక్షపాతం, భూస్వామ్య, మతపరమైన శక్తులతో అనుబంధం సమకాలీన కాలంలో భారతదేశంలోని పౌర సమాజ స్వభావాన్ని నిర్వచిస్తుంది. దేశంలో మీడియావంటి ప్రజాస్వామ్య సంస్థలు క్షీణించడంపై పౌరసమాజం ఉదాసీనత ఈ దౌర్భాగ్యానికి ప్రధానకారణంగా భావించవచ్చు.

డా. యం. సురేష్‌బాబు, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

పార్లమెంటు నిరవధిక వాయిదా

- చర్చ లేకుండానే బడ్జెట్, బిల్లుల ఆమోదం
- చివరిరోజూ అధికార, విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు షెడ్యూల్ ప్రకారమే గురువారం ముగిశాయి. బడ్జెట్ రెండోవిడత సమావేశాల్లో కనీస చర్చలు జరగకుండానే వృథాగా ముగిశాయి. అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభ రెండింటిలోనూ ఇదే పరిస్థితి. ఓ పక్క అదానీ అక్రమాలపై జేపీసీ కోసం విపక్షాలు డిమాండ్ చేయగా...విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపినందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ ఎదురుదాడికి దిగడంతో ఈ సమావేశాలు నిష్ఫలంగా ముగిశాయి. ఆశ్చర్యమేమంటే దాదాపు రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను పార్లమెంటు కేవలం పది, పదిహేను నిమిషాల్లో ఆమోదించడం. ప్రతిపక్ష పార్టీల ఆందోళనలు, అధికార పక్షం ఎదురుదాడితో పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిషన్ (జేపీసీ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు పెద్ద పెట్టున నినాదాలు చేశాయి. స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తన సభ గౌరవానికి భంగం కలిగించిందని, వారు సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించారని స్పీకర్ ఆరోపించారు. స్పీకర్ లోక్‌సభ ముగింపు ప్రసంగాన్ని పూర్తి చేసిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

సభ సమావేశం కాగానే కాంగ్రెస్, డీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి...అదానీ గ్రూపు అక్రమాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. 'మీరు సభ హుందాతనాన్ని తగ్గిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థలోనూ, దేశంలోనూ ఇది మంచి సంప్రదాయం కాదు' అని ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి స్పీకర్ ఆగ్రహం చెందారు. 'అత్యున్నతస్థాయి చర్చల కోసమే సభ ఉంది. కానీ మీరు ఉద్దేశపూర్వకంగానే ఆటంకం కలిగిస్తున్నారు. ఇది సరికాదు' అని వ్యాఖ్యానించారు. ఇలాంటి ప్రవర్తన పార్లమెంటరీ వ్యవస్థకు ఇబ్బందికరమన్నారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నల్ల దుస్తులు ధరించి వచ్చిన కాంగ్రెస్, డీఎంకే సభ్యులు స్పీకర్ విజ్ఞప్తిని ఏమాత్రం పట్టించుకోలేదు. నిరసన కొనసాగించారు.

స్పీకర్ తన ముగింపు ప్రసంగం పూర్తికాగానే సభను నిరవధికంగా వాయిదా వేశారు. ప్రధాని నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సహా అత్యధికమంది మంత్రులు సభలోనే ఉన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ సభ్యులు మెడలో కాషాయ కండువాలు వేసుకొచ్చారు.

రాజ్యసభలోనూ ఇదే తీరు...

రాజ్యసభలోనూ అదానీ అక్రమాలు, రాహుల్‌గాంధీ క్షమాపణ అంశాలు మారుమోగాయి. నాలుగువారాల పాటు సభలో ఇదేతంతు కొనసాగింది. మల్లికార్జునఖర్గేను నిన్న సభలో చైర్మన్ ధన్కర్ మాట్లాడనివ్వనందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. చివరికి గందరగోళం మధ్యే చైర్మన్ తన ముగింపు ప్రసంగం పూర్తి చేసి సభను నిరవధికంగా వాయిదా వేశారు.

రాజ్యసభ 31, లోక్‌సభ 45 గంటలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో అధిక భాగం వాయిదాల పర్వమే కొనసాగింది. దీంతో ఉభయసభలు షెడ్యూల్ కంటే చాలా తక్కువ సమయమే పనిచేశాయి. మలివిడత బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ మొత్తం 45 గంటలు, రాజ్యసభ 31 గంటల పాటు పనిచేసిందని ఓ థింక్‌థాంక్ సర్వే డేటా వెల్లడించింది. పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు మార్చి 13న ప్రారంభమయ్యాయి. అయితే అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక వ్యవహారం ఉభయసభలను కుదిపేసింది. ఈ ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని విపక్షాలు పట్టుబట్టాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. దీంతో సభలు తరచూ స్తంభించాయి.

ప్రణాళిక ప్రకారం.. లోక్‌సభ మొత్తం 133.6 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 45 గంటలు (34.28శాతం) పనిచేసింది. ఇక రాజ్యసభను 130 గంటలు నిర్వహించాల్సి ఉండగా.. 31 గంటల (24శాతం) పాటు మాత్రమే పనిచేసిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా వెల్లడించింది. లోక్‌సభలో 4.32 గంటలు, రాజ్యసభలో 1.85 గంటలు.. ప్రశ్నోత్తరాల కోసం కేటాయించారు.

ఈ ఉదయం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బడ్జెట్ సమావేశాలు ముగిసినట్లు ప్రకటిస్తూ సభను నిరవధికంగా వాయిదా వేశారు. 14.45 గంటల పాటు సాధారణ బడ్జెట్‌పై చర్చించగా.. 145 మంది ఎంపీలు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై 13.44 గంటల పాటు చర్చ జరగ్గా...143 మంది ఎంపీలు పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులను ప్రవేశపెట్టగా.. విపక్షాల ఆందోళనల మధ్య ఆరు బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

నవలఖ బెయిల్ తిరస్కరించిన ఎన్ఐఏ కోర్టు

న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసు నిందితుడు గౌతం నవలఖ బెయిల్ పిటిషన్‌ను ఎన్ఐఏ ప్రత్యేకకోర్టు గురువారం తోసిపుచ్చింది. ప్రత్యేక న్యాయమూర్తి ఇంతకుముందు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసిన బాంబే హైకోర్టు...నవలఖ బెయిల్ పిటిషన్‌ను మరోసారి వినాల్సిందిగా ఎన్ఐఏ కోర్టును ఆదేశించింది. తాజాగా సమర్పించిన అనేక ఆధారాలపై విచారణ జరిపిన ప్రత్యేక జడ్జి రాజేశ్ కటారియా నవలఖ బెయిల్‌ను తిరస్కరించారు. 2018 ఆగస్టులో నవలఖను ఎన్ఐఏ అరెస్టు చేసింది. కొంతకాలం గృహనిర్బంధంలో ఉంచిన తర్వాత 2020 ఏప్రిల్‌లో ముంబై సమీపంలోని తలోజా జైలుకు తరలించారు.

డెయిరీ ఉత్పత్తుల దిగుమతిని అంగీకరించం: పవార్

ముంబై: వెన్న, నెయ్యి వంటి డెయిరీ ఉత్పత్తుల దిగుమతి కోసం కేంద్ర ప్రభుత్వం చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా వ్యతిరేకిస్తానని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ గురువారం స్పష్టంచేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలాకు పవార్ లేఖ రాశారు. వెన్న, నెయ్యి దిగుమతి ప్రభావం స్థానిక పాల ఉత్పత్తిదారుల ఆదాయంపై పడుతుందని పవార్ హెచ్చరించారు. కొన్ని డెయిరీ ఉత్పత్తుల దిగుమతికి కేంద్రం ప్రతిపాదించినట్లు వచ్చిన మీడియా వార్తలను ప్రస్తావిస్తూ దీనికి సంబంధించి ఎలాంటి నిర్ణయమైనా ఆమోదయోగ్యం కాదని పవాల్ తేల్చిచెప్పారు. కోవిడ్-19 సంక్షోభం నుంచి డెయిరీ రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని, ఈ సమయంలో కేంద్రంలో తీసుకునే నిర్ణయం డెయిరీ రంగంపై దుష్ప్రభావం పడుతుందని పవార్ తెలిపారు.

హసన్ సీటుపై వీడిన సందిగ్ధత

నేడు రెండో జాబితా ప్రకటన: కుమారస్వామి

బెంగళూరు: మే 10వ తేదీన జరిగే కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తమ పార్టీ అభ్యర్థుల రెండోజాబితాను శుక్రవారం విడుదల చేస్తామని, అందులో అత్యంత కీలకమైన, వివాదాస్పద హసన్ సీటు కూడా ఉంటుందని జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి గురువారం తెలిపారు. హసన్ సీటుపై వివాదం పరిష్కారమైందని, ఇక ఎలాంటి సమస్యలు ఉండబోవని ఆయన దీమాగా చెప్పారు. పెరియపట్న గ్రామాల్లో 105 కిలోమీటర్ల పంచతంత్ర యాత్ర నేడు పూర్తి చేశామని, ఇంకా 90 గ్రామాల్లో పర్యటించాల్సి ఉందని కుమారస్వామి వివరించారు. తాను తిరిగి వచ్చేసరికి ఆలస్యమవుతుందని, తాను తిరిగి వచ్చిన తర్వాత సీట్లు ఖరారు చేస్తామని కుమారస్వామి ఇక్కడ విలేకరులకు చెప్పారు. హసన్ సీటు సహా అన్నింటిపై నిర్ణయం తీసుకుంటామని, సమస్య ఉండబోదని ఆయన తెలిపారు. వాస్తవంగా గురువారమే జేడీఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని కుమారస్వామి ఇంతకుముందు ప్రకటించారు. హసన్ సీటు అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. హసన్ టికెట్ కారణంగానే రెండో జాబితా విడుదలలో జాప్యం జరుగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కుమారులు కుమారస్వామి, రేవణ్ణతో హెచ్‌డీ దేవెగౌడ సమావేశమై సమస్యను పరిష్కరించుకుంటారని వెల్లడించాయి. హసన్ అసెంబ్లీ సీటుపై కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. దీనిపై రేవణ్ణ భార్య భవానీ రేవణ్ణ కన్నేశారు. ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.

ముగ్గురు ఫిరాయింపుదారులకు టికెట్లు

41 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

బెంగళూరు: ముగ్గురు ఫిరాయింపుదారులతో పాటు మొత్తం 41 మందితో రెండో జాబితాను కాంగ్రెస్ గురువారం విడుదల చేసింది. ఫిరాయింపుదారులు ఇటీవలే తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి...కాంగ్రెస్‌లో చేరారు. మాజీసీఎం సిద్ధరామయ్య కోరుకుంటున్న రెండోసీటు కోలార్‌ను మాత్రం ఇంతవరకు ప్రకటించలేదు. సిద్ధరామయ్య వరుణతో పాటు కోలార్ సీటును కూడా అడిగారు. బీజేపీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి...కాంగ్రెస్‌లోకి వచ్చిన బాబురావు చించానస్సూర్, ఎన్‌వై గోపాలకృష్ణలకు గుర్మిత్కల్, మొలకల్‌మూరు సీట్లను కేటాయించింది. అలాగే జేడీఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్‌కు కూడా గుబ్బీ సీటు కట్టబెట్టింది. సర్వోదయ కర్నాటక పార్టీ నేత దర్శన్ పుట్టన్నయ్య కోసం మాండ్య జిల్లాలోని మెలుకొటే సీటును కాంగ్రెస్ వదిలేసింది. దర్శన్ తండ్రి పుట్టన్నయ్య ప్రముఖ రైతునేత. ఆయన ఇంతకుముందు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. మాజీ సీఎం ధరంసింగ్ తనయుడు విజయ్ ధరంసింగ్, ఆయన సోదరుడు సిట్టింగ్ ఎమ్మెల్యే అజయ్ ధరంసింగ్‌లకు మొదటిజాబితాలోనే అవకాశం దక్కింది.

జార్ఖండ్ మంత్రి జగర్నాథ్ మహతో మృతి

రాంచీ: జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి జగర్నాథ్ మహతో(57) గురువారం చెన్నైలో కన్ను మూశారు. ఆయన మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ట్వీట్ చేశారు. పోరాట పటిమ, కష్టపడి పనిచేసే, ప్రజాదరణ పొందిన నాయకుడిని జార్ఖండ్ కోల్పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, ఈ కష్ట కాలంలో వారి కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్నివ్వాలని కోరుకుంటున్నానని సీఎం పేర్కొన్నారు. మహతో గిరిదిహ్‌లోని దుమ్రీ నియోజకవర్గం నుండి జేఎంఎం ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎన్నికయ్యారు. శిబు సోరెన్ నేతృత్వంలోని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2020లో ఆయన కోవిడ్ బారిన పడిన తర్వాత ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకున్నారు. ఇందు కోసం 2020 అక్టోబరులో ఆయన్ను చెన్నైకి తరలించారు. ఎనిమిది నెలల తర్వాత జూన్ 2021లో ఆయన రాంచీకి తిరిగొచ్చారు. గత నెలలో జార్ఖండ్ విధానసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మరోసారి అస్వస్థతకు గురైన ఆయనను విమానంలో చెన్నైకి తరలించారు.

ప్రతిపక్షాల నిరసనపై న్యాయమంత్రి రిజిజు అసహనం

న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాల చివరిరోజైన గురువారం పార్లమెంటులో ప్రతిపక్షాల వైఖరిని కేంద్ర న్యాయమంత్రి కిరెన్ రిజిజు తప్పుబట్టారు. రాజ్యసభ లో బీజేపీ పక్ష నేత పీయూష్ గోయల్, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌తో కలిసి రిజిజు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, దాని మిత్రులు ఒక వ్యక్తి (రాహుల్ గాంధీ) కోసం పార్లమెంటును స్తంభింప చేస్తున్నాయన్నారు. 'చివరి రోజు కూడా కాంగ్రెస్, దాని మిత్రులు సభకు అంతరాయం కలిగించారు... నల్ల బట్టలు వేసుకుని మళ్లీ పార్లమెంటును అవమానించారు...ఇది దేశానికి దురదృష్టకరం...పార్లమెంట్ గౌరవాన్ని కాపాడాలని కోరుతున్నాం... రాహుల్ గాంధీ అనే ఒక ఎంపీ కోసం కాంగ్రెస్ దాని మద్దతుదారులు ఏమి చేస్తున్నారో దేశం చూస్తోంది' అని ఆయన అన్నారు. కోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ దాని మిత్రులు సూరత్ కోర్టుకు ఎలా వెళ్లాయో మనం చూశామని, వారు ఊరేగింపు జరిపిన తీరు ఖండించదగినదని రిజిజు పేర్కొన్నారు.

జలంధర్‌లో ఆప్ అభ్యర్థిగా కాంగ్రెస్ మాజీ నేత

చండీగఢ్: జలంధర్ లోక్‌సభ ఉపఎన్నికకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన అభ్యర్థిగా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సుశీల్ రింకూను ప్రకటించింది. జలంధర్ పార్లమెంట్ స్థానానికి మే 10న పోలింగ్, మే 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. బుధవారం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సమక్షంలో రింకూ ఆప్‌లో చేరారు. ఉపఎన్నికకు ఆప్ అభ్యర్థిగా రింకూ పేరు ఖరారు చేసిన విషయాన్ని మన్ గురువారం ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. రింకూ గతంలో జలంధర్ వెస్ట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కి అభ్యర్థి శీతల్ అంగురల్ చేతిలో ఓడిపోయారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ కాంగ్రెస్ పార్టీ బుధవారం రింకూను పార్టీ నుంచి బహిష్కరించింది. జనవరిలో కాంగ్రెస్ ఎంపీ సంతోక్ సింగ్ చౌదరి (76) మరణించడంతో జలంధర్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. జలంధర్‌లోని ఫిలింనగర్‌లో పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఈయన గుండెపోటుతో మరణించారు.

దిల్లీ మద్యం కుంభకోణం

ఈడీ అనుబంధ చార్జిషీట్ దాఖలు

న్యూఢిల్లీ: దిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం ఇక్కడి కోర్టులో అనుబంధ చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ముగ్గురు నిందితుపై అభియోగాలు నమోదు చేసింది. మాగుంట రాఘవ , రాజేష్ జోషి, గౌతమ్ మల్హోత్రా పై అభియోగాలు మోపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అరెస్ట్ చేసిన నిందితుల విచారణకు సంబంధించిన అంశాలను ఈ చార్జిషీట్‌లో ఈడీ ప్రస్తావించింది. దిల్లీ లిక్కర్ స్కాంపై గత ఏడాది నవంబర్ 26న తొలి చార్జిషీట్‌ను ఈడీ కోర్టుకు సమర్పించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండో చార్జిషీట్ ను దాఖలు చేసింది. రెండో చార్జిషీట్ లో మనీశ్ సిసోడియా, అరవింద్ కేజ్రీవాల్, కవిత పేర్లను ఈడీ చేర్చింది. తాజాగా అనుబంధ చార్జిషీట్ ను దాఖలు చేసింది. దీనిలో ముగ్గురి పేర్లను ఈడీ పేర్కొంది. అయితే ఈ చార్జిషీట్ ను ఈ నెల 14న స్వీకరించనున్నట్లు దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తెలిపింది.

ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధానం

ఇంకా ప్రారంభించలేదు : కేంద్రం

న్యూఢిల్లీ: ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ వివరాలను అనుసంధానించడం ఇంకా ప్రారంభం కాలేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు గురువారం రాజ్యసభకు వెల్లడించారు. ప్రతిపాదిత అనుసంధానానికి ప్రక్రియ మొదలైనప్పటికీ ఎటువంటి లక్ష్యం లేదా సమయపాలన ఇవ్వబడలేదని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఓటర్ల జాబితాతో తమ ఆధార్ వివరాలను లింక్ చేయని వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించబోమని కూడా మంత్రి స్పష్టత ఇచ్చారు. ఆధార్ నంబర్‌ను సమర్పించడానికి గడువు మార్చి 31, 2024 వరకు పొడిగించినట్లు కూడా మంత్రి తెలిపారు. ఈ మేరకు లిఖితపూర్వక సమాధానంలో ఆయన తేల్చిచెప్పారు. సవరించబడిన ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 23 కింద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆగస్టు 1, 2022 నుండి స్వచ్ఛందంగా ఇప్పటికే ఉన్న, కాబోయే ఓటర్ల ఆధార్ నంబర్‌ను సేకరించే కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించింది.

సత్యేందర్ జైన్‌కు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు దిల్లీ కోర్టులో చుక్కెదురైంది. మనీలాండరింగ్ కేసులో అరెస్టు అయిన ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు దిల్లీ హైకోర్టు నిరాకరించింది. జైన్ దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం జైన్ సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తి అని, అందువల్ల ఆయన బయటకొస్తే ఈ కేసులో సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఏకసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు బెయిల్ మంజూరుకు నిరాకరించింది. మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్‌ను గతేడాది మే నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన విచారణ కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆ బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

ఇక జమ్ముకశ్మీరు ఎన్నికలు?

- త్వరలో కేంద్ర ఎన్నికల కమిషన్ పర్యటన
- స్వాగతించిన రాజకీయ పార్టీలు

శ్రీనగర్: జమ్ముకశ్మీరు అసెంబ్లీ ఎన్నికల్లో త్వరలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత ఎన్నికల కమిషన్ ఈ నెలలోనే జమ్ముకశ్మీరులో పర్యటించాలన్న ప్రతిపాదన ఎన్నికల నిర్వహణకు ఊతమిస్తుంది. ఈ ఏడాదిలోనే కచ్చితంగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. 2014లో జమ్ముకశ్మీరు అసెంబ్లీకి చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ల తర్వాత అంటే 2019 ఆగస్టు 5న రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరణ చేసి...రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మోదీ సర్కారు విభజించింది. అప్పుడు జమ్ముకశ్మీరుకు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. కమిషన్ తన నివేదికను గతేడాది అక్టోబరులోనే ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్ర పాలిత ప్రాంతంలో శూన్యం ఏర్పడిన విషయం ఎన్నికల కమిషన్‌కు తెలుసునని, దీనిని త్వరలోనే పూడుస్తామని సీఈసీ రాజీవ్‌కుమార్ ఇటీవల చెప్పారు. వాతావరణం, భద్రత సహా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని ఆయన తెలిపారు. కశ్మీరు పర్యటన ఎప్పుడో ఈసీఐ ప్రకటించనప్పటికీ ఈ నెలలోనే ఉంటుందని స్థానిక మీడియా ప్రచారం చేస్తోంది. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా తమ పార్టీ, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ నేత దరక్షన్ అంద్రాబీ చెప్పారు. ప్రజాస్వామ్యం, ఎన్నికలపై తమకు విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, అయితే తుది నిర్ణయం మాత్రం ఈసీదేనని ఆమె పీటీఐకి చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కోరుకుంటుందని, కశ్మీరును ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలని కాంక్షిస్తున్నామని ఆమె చెప్పారు. అప్నీ పార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ బుఖారీ స్పందిస్తూ కశ్మీరులో ఎన్నికల కమిషన్ పర్యటనను స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు ఇదే సరైన సమయమని తెలిపారు. జమ్ముకశ్మీరు ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, అందువల్ల ఈసీ పర్యటన ఇప్పటికే ఆలస్యమైనట్లు భావిస్తున్నామన్నారు. ఏ సమయంలోనైనా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు లెఫ్టినెంట్ గవర్నరు చెప్పిన నేపథ్యంలో ఈసీ పర్యటనను సానుకూలంగా చూడాల్సి ఉందని బుఖారీ తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధికార ప్రతినిధి ఇమ్రాన్ నబీ దర్ మాట్లాడుతూ పార్టీ అధినేత ఫరూక్ అబ్దుల్లా నాయకత్వాన ప్రతినిధిబృందం కలిసి ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే కోరిందని, దీనిపై పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధిత సంస్థలకు సైతం ఎలాంటి ఇబ్బందులు ఉండవని దర్ చెప్పారు. విభజిత జమ్ముకశ్మీరుకు ఎన్నికైన ప్రభుత్వం కావాలని, ఎన్నికల జాప్యానికి కారణాలేమీ కనిపించడం లేదన్నారు.

దేశంలో శాంతి నెలకొల్పిన మోదీ

హోంమంత్రి అమిత్ షా



సలాంగ్‌పూర్(గుజరాత్): ప్రధాని నరేంద్రమోదీ ఎలాంటి గందరగోళం లేకుండా కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకుని అమలు చేస్తూ దేశంలో ప్రశాంతతను కొనసాగించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా అమిత్ షా... గుజరాత్‌లోని బోటాడ్ జిల్లా సలాంగ్‌పూర్ గ్రామంలో ప్రసిద్ధ హనుమాన్ దేవాలయం శ్రీ కష్టభంజన్ దేవ్ మందిర్‌లో కొత్తగా నిర్మించిన మెగా వంటశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణతో సహా మతపరమైన, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన కొన్ని భారీ ప్రాజెక్టులను షా ప్రస్తావించారు. బీజేపీ ఏర్పాటైన తర్వాత కేవలం రెండు లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకున్నప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దీనిపై ఎగతాళి చేశారని, అయితే ఇప్పుడు దేశంలోని 16 రాష్ట్రాల్లో బీజేపీకి ప్రభుత్వాలు ఉన్నాయని, 400 మందికి పైగా పార్లమెంటు సభ్యులు ఉన్నారని షా చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా భారతీయ సంస్కృతికి పెద్దపీట వేసి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిందని షా అన్నారు. అయోధ్యలో రామజన్మభూమి కోసం బాబర్ కాలం నుంచి లక్షలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, ఈ సమస్యను పరిష్కారం కాకుండా కాంగ్రెస్ సమస్యను సాగదీసిందని చెప్పుకొచ్చారు. ఈరోజున కోర్టు తీర్పు వచ్చి మోదీజీ రామమందిర నిర్మాణానికి భూమిపూజ చేశారన్నారు. ఆర్టికల్ 370, రామజన్మభూమి అంశాల జోలికివెళ్తే అల్లర్లు చెలరేగుతాయని కొందరు చెబుతున్నప్పటికీ అలాంటిదేమీ జరగలేదని బీజేపీ నేత అన్నారు. హనుమాన్ జయంతితో పాటు, ఈ రోజు బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం కూడా కావడం యాదృచ్ఛికమని అన్నారు. మాజీ ప్రధాని అటల్ జీ, అద్వానీజీ సిద్ధాంతాల ఆధారంగా 1980 ఏప్రిల్ 6న బీజేపీని స్థాపించారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ స్థాపనపై ప్రకటన చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ సమయంలో చాలా మంది బీజేపీని ఎగతాళి చేశారని, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాకు కేవలం రెండు సీట్లు వచ్చినప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ పార్లమెంట్‌లో 'హమ్ దో హమారే దో' అని సరదాగా అన్నారు. హనుమంతుడి ఆశీస్సుల వల్లే ఇప్పుడు బీజేపీకి 16 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయని, 400 మంది పార్లమెంటు సభ్యులున్నారని అమిత్‌షా వెల్లడించారు. 'నరేంద్ర మోదీకి పూర్తి మెజారిటీ రావడంతో నిశ్శబ్దంగా, పెన్ స్ట్రోక్‌తో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 (జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడానికి) రద్దు చేశారు... వారి కోరికను ప్రధాని మోదీ నెరవేరుస్తూ కశ్మీర్‌ను మన సొంతం చేయడంతో ఈ దేశంలోని ప్రతి పౌరుడు సంతోషంగా ఉన్నారు' అని షా అన్నారు. కాగా అమిత్ షా శ్రీ కష్టభంజన్ దేవ్ మందిర్‌లో ప్రారంభించిన వంట శాల రూ. 55 కోట్లతో నిర్మితమైంది. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉంది. దాదాపు 4,000 మంది భక్తులు ఏకకాలంలో భోజనం చేయవచ్చు.

రికార్డు స్థాయిలో గోదుమ ఉత్పత్తి?

న్యూఢిల్లీ: దేశంలో కొన్ని ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం కారణంగా పంట దెబ్బతిన్నప్పటికీ జూన్‌తో ముగిసే 2022-23 పంట సంవత్సరంలో రికార్డు స్థాయిలో 112.18 మిలియన్ టన్నుల గోదుమ ఉత్పత్తిని సాధించవచ్చని ప్రభుత్వం ఆశాభావంతో ఉందని కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా గురువారం తెలిపారు. 2022-23 పంట సంవత్సరం (జులై-జూన్) లో రికార్డు స్థాయిలో 112.18 మిలియన్ టన్నుల గోదుమ ఉత్పత్తిని ప్రభుత్వం అంచనా వేసింది. కొన్ని రాష్ట్రాల్లో వేడిగాలుల కారణంగా పంట ఉత్పత్తి అంతకుముందు సంవత్సరం 107.74 మిలియన్ టన్నులకు స్వల్పంగా తగ్గింది. 'గత రెండు వారాలుగా ప్రతికూల వాతావరణం కారణంగా గోదుమ పంటకు కొంత నష్టం జరిగింది. కానీ ఉత్పత్తి నష్టం చాలా తక్కువగా ఉంటుంది. మొత్తం ఉత్పత్తి లక్ష్యమైన 112.2 మిలియన్ టన్నులను సాధించగలమని మేము ఆశిస్తున్నాము' అని చోప్రా చెప్పారు. మధ్యప్రదేశ్‌లో గోదుమ సేకరణ కోసం నాణ్యతా నిబంధనలను సడలించామని, పంజాబ్, హరియాణాలో గోదుమ సేకరణ కోసం నాణ్యత నిబంధనలను సడలించడంపై కేంద్రం త్వరలో ప్రకటన చేస్తుందని చోప్రా తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఎఫ్‌సీఐ, రాష్ట్ర ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ప్రారంభమయ్యాయి. ఇటీవలి అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా కీలక ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో 8-10 శాతం గోధుమ పంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. అయితే ఆలస్యంగా విత్తిన ప్రాంతాలలో మెరుగైన దిగుబడి అవకాశాలున్నందున అనుకున్న లక్ష్యం మేరకు ఉత్పత్తికి సరిపోతుందని కేంద్రం సోమవారం తెలిపింది. ఇటీవల ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ రెండవ అంచనా ప్రకారం ఈ సంవత్సరం దేశంలోని మొత్తం గోదుమ ఉత్పత్తి రికార్డు స్థాయిలో 112.2 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని వ్యవసాయ కమిషనర్ పీకే సింగ్ స్పష్టం చేశారు.

చరిత్ర వక్రీకరణ ఆక్షేపణీయం

- ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో కీలకాంశాల తొలగింపుపై నిరసన
- ధర్మేంద్ర ప్రధాన్‌కు వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: పసి హృదయాల్లో మతం బీజం నాటే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని, స్కూలు పాఠ్యపుస్తకాల్లో తీవ్రస్థాయిలో సవరణలు జరుగుతున్నాయని, తద్వార యువమేధస్సుకు అర్ధసత్యాలే అందుతున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం ఆందోళన వ్యక్తంచేశారు. దేశ చరిత్ర, రాజకీయాలు, సామాజిక శాస్త్రాలు మతం రంగు పలుముకుంటున్నాయని విమర్శించారు. ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలను వక్రీకరిస్తూ, మతతత్వవాదాన్ని నూరిపోసేలా సవరిస్తున్నారని, దీనికి అడ్డుకట్ట అనివార్యమని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. భారతీయ చరిత్రలో కీలక పరిణామాలు, పూర్వకాల ఆలోచనల ధోరణులను మార్చేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని నొక్కిచెప్పారు. చాలా వరకు సామాజిక శాస్త్రంలోనే మార్పులు జరగడాన్ని బట్టి మన సమాజం, రాజకీయాలు, చరిత్ర గురించి క్లిష్టమైన విశ్లేషణను కట్టడి చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. 'మహాత్మాగాంధీ గురించి, హిందూ-ముస్లిం ఐక్యతకు ఆయన చేసిన ప్రయత్నాలు ఏ విధంగా హిందూ అతివాదులకు ఆగ్రహం తెప్పించింది, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధానికి దారి తీసిన పరిణామాలను ఎన్‌సీఈఆర్టీ 12వ తరగతి చరిత్ర నుంచి తొలగించారు. గాంధీ మరణం దేశీయ మత పరిస్థితిని ఏ విధంగా ప్రభావితం చేసిందీ లేదు. 11వ తరగతి సోషియాలజీలో నుంచి గుజరాత్ అల్లర్లను తొలగించారు. రెండో తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో 2022 మతఘర్షణల ప్రస్తావనే లేకుండా చేశారు. ఇదంతా పూర్తి స్థాయిలో చరిత్ర, రాజకీయాలు, సామాజిక అధ్యయనాన్ని వక్రీకరించడం, మతవాదాన్ని నూరుపోసే ప్రయత్నాలని స్పష్టమవుతున్నాయి. ఇలాంటి సరణలన్నీ నిపుణుల బృందం చేసినదాన్ని బట్టి మన వ్యవస్థలో సైద్ధాంతిక వివక్ష ఎంతలా పాతుకుపోయిందో అర్థమవుతోంది' అని వినయ్ విశ్వం పేర్కొన్నారు. మహాత్మాగాంధీ హత్యకు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలను తొలగించడం ద్వారా నాథురామ్ గాడ్సే సైద్ధాంతిక అతివాదాన్ని తగ్గించే యత్నమన్నారు. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోదీకి ప్రధాని ఏబీ వాజ్‌పేయి పంపిన సందేశం, నిష్పాక్షిక విధానం అమలుకు చేసిన సూచనలనూ పుస్తకాల్లో నుంచి తొలగించారన్నారు. ఢిల్లీ రాచరిక పాలన, మొఘల్ సామ్రాజ్యం, అప్పటి సాహిత్యం, కళలు, సామాజిక ఉద్యమాల ప్రస్తావన లేకుండా చేశారు. యువతరాన్ని తప్పుదోవ పట్టించే ఈ ప్రయత్నాలు ఖండనార్హం. వారికి పూర్తి నిజాలు తెలియాలి, అర్ధసత్యాలు కాదు. ఇటువంటి వివక్షపూరిత మార్పులతో భావితరానికి తీరని అన్యాయం జరుగుతుంది. భావితరాలలో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణ స్ఫూర్తిని పరిరక్షించడానికి ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో కీలకాంశాల తొలగింపు, వివక్షపూరిత సవరణలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని లేఖలో విశ్వం పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ అరాచకాన్ని అడ్డుకున్న సీపీఐ ఎమ్మెల్యే

పాట్నా: సంఘ్ పరివార్ మతం పేరుతో సృష్టిస్తున్న అల్లర్లకు బీహార్‌కు చెందిన సీపీఐ ఎమ్మెల్యే రాం రతన్ సింగ్ ఆదర్శప్రాయమైన సమాధానం చెప్పారు. హనుమాన్ జయంతి ర్యాలీ పేరుతో పశ్చిమ బెంగాల్లో జరిగిన హింస, విధ్వంసాన్ని ఇంకా మరచిపోకముందే, బీహార్‌లోనూ ఆర్‌ఎస్‌ఎస్ అలాంటి ప్రయత్నమే చేసింది. తెఘ్రా పట్టణంలో శోభాయాత్ర చేపట్టింది. ప్రధానంగా మసీదు ప్రాంతం మీదుగా యాత్రను కొనసాగించి, మత కలహాలను రెచ్చగొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఇది పసిగట్టిన స్థానిక ఎమ్మెల్యే, సీపీఐ నేత రాం రతన్ సింగ్ సీపీఐ శ్రేణులతో కలిసి మసీదు ముందు కూర్చుకున్నారు. శోభాయాత్ర ప్రారంభానికి ముందే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే యాత్ర ముగిసే వరకూ స్వయంగా అక్కడ ఉండి, పరిస్థితులను సమీక్షించారు. దీనితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. మత విద్వేషాలను రెచ్చగొట్టి, పబ్బం గడుపుకోవాలనుకుంటున్న సంఘ్ పరివార్ ప్రయత్నాలను రాం రతన్ సింగ్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి సమర్థమంతంగా అడ్డుకున్నారని స్థానికులు ప్రశంసించారు.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'జగనన్నే మా భవిష్యత్తు' పేరిట ఈనెల 7వ తేదీ నుంచి ఏప్రిల్ 20 వరకు 1.60కోట్ల కుటుంబాలను నేరుగా కలిసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటి గడపకు సీఎం జగన్ సైనికులుగా, వైసీపీ పదాతిదళంగా, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి క్షేత్రస్థాయిలో పనిచేస్తారని, గృహసారథులు ఇంటింటికీ వెళ్తారని, వారిని సచివాలయ కన్వీనర్లు సమన్వయం చేస్తారన్నారు. దాదాపు 7 లక్షల మంది గృహసారథులు కోటి 60 లక్షల ఇళ్లను 14 రోజుల్లో సందర్శిస్తారని, దాదాపు ఐదుకోట్ల మంది ప్రజలను ప్రత్యక్షంగా కలిసి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల పనితీరుపై అభిప్రాయాల్ని తెలుసుకుంటారన్నారు. సీఎం జగన్ ఇటీవల సభల్లో చెబుతున్నట్లుగా ప్రపంచం మొత్తం ఆర్థికసంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా అందుకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పంటిబిగువున పేదవాడి సంక్షేమం, భవిష్యత్తుపై ఆలోచిస్తోందన్నారు. ప్రతీ పేదవాడి అవసరాలు గుర్తించి, వాటిని నూటికి నూరుశాతం తీర్చడమే కాకుండా వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తల నేతృత్వంలో తమ తరఫున గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతీ గడపగడపకు తిరిగి...ప్రతీ ఇంటి తలుపు తట్టి ఒక కరపత్రం అందజేస్తారన్నారు.

పోలవరం ఎత్తు తగ్గించబోం: మంత్రి అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రసక్తి లేదని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాదెండ్ల మనోహర్ ఢిల్లీ వెళ్లి పోలవరంపై అర్థం లేకుండా విచిత్రమైన మాటలు మాట్లాడుతున్నారంటూ ధ్వజమెత్తారు. పోలవరం ఎత్తుపై నాదెండ్ల మనోహర్ మాట్లాడిందీ తెలుగుదేశం మాట అని, వాళ్లు తానా అంటే వీళ్లు తందానా అంటున్నారని విమర్శించారు. ఈనెల 7వ తేదీ నుంచి 20 వరకు రెండు వారాల పాటు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని ద్వారా గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమాన్ని వివరించి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరతారని చెప్పారు. చంద్రబాబు పల్లకి మోయడం కోసమే పవన్‌కల్యాన్ తాపత్రయం పడుతున్నారని ఆరోపించారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబుకు ఉందా? అని నిలదీశారు.

శ్రీనాథరెడ్డి వ్యక్తిత్వం విలక్షణం

సంస్మరణ సభలో సజ్జల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి వ్యక్తిత్వంలోనే విలక్షణతత్వం ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన శ్రీనాథరెడ్డి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనాథరెడ్డి యాదృచ్ఛికంగా జర్నలిజంలోకి వచ్చారన్నారు. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చినప్పటికీ పేదల కష్టనష్టాలు ఆయనకు బాగా తెలుసని పేర్కొన్నారు. రాయలసీమ కష్టాలు, కరువును కళ్లారా చూశారన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ భాగస్వామ్యంతో జర్నలిస్టులకు అకాడమీ తరఫున సర్టిఫికెట్ కోర్సును అందించారన్నారు. ప్రెస్‌అకాడమీ ఛైర్మన్‌గా కోవిడ్‌లోనూ బాధ్యతగా జర్నలిస్టుల కోసం పనిచేశారన్నారు. తన మేధస్సును రచయితలకు, కథకులకు ముడిసరుకుగా ఇచ్చారన్నారు. ఏపీయూడబ్ల్యూజే తరఫున రాయలసీమ ఉద్యమాల్లో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. శ్రీనాథరెడ్డి మరణం ప్రభుత్వానికి, వ్యక్తిగతంగా తనకూ తీరని లోటని వాఖ్యానించారు. ప్రభుత్వ సలహాదారుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ వృత్తిపట్ల నిబద్ధత గల వ్యక్తి శ్రీనాథరెడ్డి అని కొనియాడారు. యాభై ఏళ్లుగా రాయలసీమలో ఆయన పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. శ్రీనాథ్‌రెడ్డి పేరు మీద యోగివేమన యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులకు బంగారు పతకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జర్నలిజం వృత్తిని, కార్మిక ఉద్యమాన్ని సమన్వయం చేసుకుంటూ శ్రీనాథ్‌రెడ్డి ముందుకు సాగారన్నారు. మంచి జర్నలిస్టుగా గుర్తించిన ప్రభుత్వం ఆయనకు ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ పదవి ఇవ్వడం సముచితమన్నారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి మృతి జర్నలిజానికి, యూనియన్‌కు తీరని లోటన్నారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్ అకాడమీకి అందించిన సేవలు మరువలేనివన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేశారన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్థన్, ఐజేయూ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జయరాజు, విజయవాడ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు శ్రీనాథరెడ్డి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

ఏపీపీజేఏ క్యాలెండర్ ఆవిష్కరణ: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోషియేషన్ (ఏపీపీజేఏ) అధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.సాంబశివరావుతో పాటు కొంతమంది ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆఫ్రికా విప్లవయోధుడు మూసి మృతి

ఆఫ్రికా స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవయోధుడు, సీనియర్ కామ్రేడ్ ఎంబులెలో మూసి కన్నుమూశారు. ఆయన మరణం ఆఫ్రికా దేశాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) సంతాపాన్ని ప్రకటించింది. తమ పతకాలను అవనతం చేసి నివాళులర్పించింది. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యజించిన తరానికి చెందిన మూసి.... అధికార యంత్రాంగం వేధింపులు, పోలీసుల దాష్టీకాలు, దురాగతాలను ఎదుర్కొన్నారని, చరిత్రాత్మక మటోలా దాడులలో ప్రాణాలతో బయట పడిన వారిలో ఈయన ఉన్నారని సంతాప సందేశంలో ఏఎన్‌సీ పేర్కొంది. 1981 జనవరి 30న ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)కి చెందిన మపుటా శివార్లలోని మటోలాలోగల సేఫ్ హౌసులపై దక్షిణ ఆఫ్రికా రక్షణ దళం దాడులు చేయగా 12 మంది ఎంకే సభ్యులు, ఒక మొంజాబికన్ పౌరుడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. మూసి స్ఫూర్తితో పోరాటాలకు సన్నద్ధం కావాలని తమ కేడర్‌కు ఏఎన్‌సీ పిలుపునిచ్చింది. వ్యక్తిగతంగా ఆయన ఎన్నో త్యాగాలు చేశారని, రాజకీయంగా క్రమశిక్షణ, నిబద్ధతతో మెలిగారని కొనియాడింది. ఈ తరానికి మూసి ఆదర్శప్రాయమని పేర్కొంది. మూసి కుటుంబం, బంధుమిత్రులు, సహచరులు, మాస్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్ సభులందరికీ సానుభూతిని తెలిపింది. దక్షిణాఫ్రికా ప్రజలు, ఉద్యమానికి మూసి తన జీవితాన్ని అంకితం చేయగా అందుకు సహకరించిన ఆయన కుటుంబానికి కృతజ్ఞులమని పేర్కొంది. కామ్రేడ్ మూసి నివాళుర్పించింది.

ప్రభుత్వ వాహనాలకు 40జీ

- ఇకపై కొత్త సిరీస్‌తో రిజిస్ట్రేషన్‌లు
- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన రవాణాశాఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ వాహనాలకు ఇప్పటివరకూ ఇస్తున్న వివిధ సిరీస్‌ల స్థానంలో ఇకపై ఒక కొత్త సిరీస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు రవాణాశాఖ తాజాగా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిప్రకారం ఇకపై ప్రభుత్వ వాహనాలకు ఏపీ 40జీ అనే కొత్త రిజిస్ట్రేషన్ నంబరు ఇచ్చేందుకు వీలుగా మోటారు వాహనాల చట్టంలో సవరణ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. తమిళనాడు ప్రభుత్వం ప్రభుత్వ వాహనాలను సులువుగా గుర్తించేలా ఇటువంటి తరహా ప్రక్రియను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ ఉన్న పాత వాహనాలు మాత్రం అవే సిరీస్, నంబర్లతో కొనసాగుతాయి. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే కొత్త సిరీస్‌తో నంబర్లను కేటాయిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ వాహనాలు ఏపీ 18, ఏపీ 39 ఇలా వివిధ సిరీస్‌లతో కొనసాగుతున్నాయి. గతంలో జిల్లాల వారీ గుర్తించేలా జిల్లాకొక సిరీస్‌ను కేటాయించారు. ఆ విధానం 2018 చివరి నుంచి మార్పు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేలా ఉండేలా ఏపీ 39 సిరీస్‌ను రవాణాశాఖ జారీ చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను వేరు చేసేలా కొత్త సిరీస్‌ను తీసుకొస్తోంది. దీనిపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను కోరుతున్నట్లు రవాణాశాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ధోనీ సిక్స్‌లు కొట్టిన తీరు అద్భుతం

మార్క్ వుడ్

చెన్నై: ఐపీఎల్ - 16వ సీజన్‌ను ఓటమితో ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్... ఏప్రిల్ 3న లక్నో సూపర్ జెయింట్స్‌పై వ విజయం సాధించింది. అది కూడా కేవలం 12 పరుగుల తేడాతోనే గెలవడం గమనార్హం. మార్క్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఎంఎస్ ధోనీ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టకపోయుంటే కచ్చితంగా సీఎస్‌కే ఓడిపోయి ఉండేదని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. తాజాగా మార్క్‌వుడ్ కూడా ఎంఎస్ ధోనీ సిక్స్‌లు కొట్టిన విధానంపై స్పందించాడు. ధోనీని ఔట్ చేసేందుకు తాను, కెప్టెన్ కేఎల్ రాహుల్ ప్రణాళికలు వేశామన్నాడు. అయితే, ధోనీ వికెట్ తీసినా అప్పటికే రెండు సిక్స్‌లు సమర్పించుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. 'ఎంఎస్ ధోనీ బ్యాటింగ్‌కు వచ్చిన సమ యంలో... నేను, కేఎల్ రాహుల్ మాట్లాడుకు న్నాం... అతడిని త్వరగా ఔట్ చేయాలని భావించా... అయితే, డిఫెన్సివ్‌గా బౌలింగ్ చేయాలని అనుకోలేదు... పరుగులు తీయనీయకుండా చేసి వికెట్ తీయాలని అనుకున్నా... దురదృష్టవశాత్తూ 12 పరుగులు సమర్పించుకున్నా... రెండో షాట్ కొట్టిన విధానం మాత్రం అద్భుతం... నేను, కేఎల్ ఎక్కడ బంతిని సంధించాలని భావించామో... అక్కడే వేశా... కాస్త దూరంగా బౌన్సర్ సంధించినా కూడా ధోని కొట్టిన తీరు మాత్రం అద్భుతం' అని మార్క్‌వుడ్ ఓ క్రీడా ఛానెల్‌తో వ్యాఖ్యానించాడు. చివరి ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టాడు. అయితే, తాను ఆడిన మూడో బంతిని కూడా భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్‌కు చేరాడు.

వన్డే ప్రపంచకప్‌కు విలియమ్సన్ దూరం

వెల్లింగ్టన్: ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ ట్రోఫీ నెగ్గాలనుకున్న న్యూజిలాండ్ జట్టుకు పెద్ద షాక్. ఆ జట్టులో స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఈ మెగా టోర్నీ మొత్తానికి దూరం కానున్నాడు. ఐపీఎల్ 16వ సీజన్ ఆరంభ పోరులో ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన విలియమ్సన్ త్వర లోనే కుడి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోనున్నాడు. అతను కోలుకునేందుకు, ఫిట్‌నెస్ సాధించేందుకు కనీసం ఆరు నెలల సమయం పట్టనుంది. దాంతో, వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు విలియమ్సన్ దూరం కానున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. 'న్యూజిలాండ్ క్రికెట్, గుజరాత్ టైటన్స్ ఫ్రాంఛైజీ నుంచి గత కొన్ని రోజులుగా నాకు చాలా మద్దతు లభించింది. ఫీల్డింగ్ చేస్తూ అలా గాయపడడం ఎవరికైనా నిరాశకు గురి చేస్తుంది. అయితే.. ఇప్పుడు నా ఫోకస్ అంతా సర్జరీ మీద, రీహాబిలిటేషన్‌లో ఉండడం మీద మాత్రమే ఉంది. నేను కోలుకునేందుకు కొంత సమయం పట్టనుంది. వీలైనంత త్వరగా మైదానంలో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తాను' అని ఈ స్టార్ ఆటగాడు ఓ ప్రకటనలో తెలిపాడు. ఇప్పటికే విలియమ్సన్ ఐపీఎల్‌కు దూరమైన విషయం తెలిసిందే. ఐపీఎల్ 16వ సీజన్ తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా ఈ కివీస్ బ్యాటర్ గాయపడ్డాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద ఎగిరి ఆపేందుకు ప్రయత్నించి కింద పడ్డాడు. అనంతరం నొప్పితో విలవిలలాడుతూ మైదానం వీడాడు. స్కానింగ్‌లో అతని కుడిమోకాలు బెణికినట్టు గుర్తించారు. దాంతో, న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు పిలుపు మేరకు అతను స్వదేశానికి వెళ్లాడు. ఆఖర్లో ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో చెన్నైపై గుజరాత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్ ధాటిగా ఆడడంతో పాండ్యా సేన విజయం సాధించింది. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్ మధ్యలో వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. మోకాలి సర్జరీ కారణంగా విలియమ్సన్ ఈసారి టోర్నీ మొత్తానికి దూరం కానున్నాడు. మిడిలార్డర్‌లో అతడిలా ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ఆటగాడు లేకపోవడం కివీస్ జట్టుకు పెద్ద లోటు. 2019 ప్రపంచకప్ ఫైనల్ చేరిన కివీస్ రన్నరప్‌గా నిలిచింది. బెన్ స్టోక్స్ చెలరేగడంతో మ్యాచ్ సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. ఉత్కంఠ రేపిన సూపర్ ఓవర్‌లో ఇయాన్ మోర్గాన్ సేన ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది.

నిఖత్ జరీన్‌కు సత్కారం

హైదరాబాద్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్న మహిళా బాక్సర్ నిఖత్ జరీన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ అభినందించారు. బీఆర్‌కే భవన్‌లో నిఖత్ జరీన్... సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరీన్‌ను శాలువాతో సత్కరించారు. నిఖత్ జరీన్ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలిపిందని సీఎస్ శాంతికుమారి ప్రశంసించారు. ఈ విజయంతో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలుచుకున్న రెండవ భారతీయ బాక్సర్‌గా నిఖత్ జరీన్ చరిత్ర సృష్టించిందని డీజీపీ కొనియాడారు. నేటి యువ క్రీడాకారులకు జరీన్ ఆదర్శవంతంగా నిలిచిందని డీజీపీ అంజనీ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడలు, యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో నిఖత్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

అతడి కోసం పంజాబ్ కింగ్స్ ఎదురు చూపు

గౌహతి: ఐపీఎల్ 16వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. ఓపెనర్లు, మిడిలార్డర్ రాణించడంతో బుధవారం రాజస్థాన్ రాయల్స్‌తో గౌహతిలో ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించింది. పంజాబ్‌కు ఇది వరుసగా రెండో విజయం. అయితే.. స్టార్ ఆల్‌రౌండర్, విధ్వంసక బ్యాటర్ లివింగ్‌స్టోన్ ఇంకా జట్టుతో కలవలేదు. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), లాంక్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ అతడికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చాయి. అయినా కూడా అతను ఎప్పుడు భారత్‌కు వస్తాడు? టీమ్‌తో ఎప్పుడు కలుస్తాడు? అనే విషయంపై స్పష్టత లేదు. ఒంటిచేత్తో మ్యాచ్ గెలిపించే అతడి రాక కోసం పంజాబ్ కింగ్స్ ఫ్రాంఛైజీ నిరీక్షిస్తోంది. 'లివింగ్‌స్టోన్ వచ్చే వారం భారత్ వస్తాడు' అని ఫ్రాంఛైజీ అధికారి ఒకరు తెలిపారు. కానీ, ఈసీబీ మాత్రం ఏప్రిల్ రెండో వారంలో లివింగ్‌స్టోన్ ఇండియాకు వెళ్తాడు అని పేర్కొంది. 'అతను ఇంకా వంద శాతం ఫిట్‌నెస్ సాధించలేదు. అతన ప్రస్తుతం ఓల్డ్ ట్రఫోర్డ్‌లో రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్నాడు. లాంక్‌షైర్ కౌంటీ క్లబ్ తరఫున మ్యాచ్‌లు ఆడి తన ఫిట్‌నెస్ మెరుగు పరుచుకుంటున్నాడు' అని వివరించింది. లివింగ్‌స్టోన్ కొన్నాళ్లుగా కాలి మడిమ, మోకాలి సమస్యలతో బాధ పడుతున్నాడు. అతను పోయిన ఏడాది డిసెంబర్ నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. 2022 మినీ వేలంలో రూ.11.5 కోట్ల ధరకు ఈ ఆల్‌రౌండర్‌ను పంజాబ్ కొనుగోలు చేసింది. గత సీజన్లలో పెద్దగా ఆకట్టుకోలేని పంజాబ్ కింగ్స్ 16వ సీజన్‌లో చెలరేగి ఆడుతోంది. తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై పంజాబ్ 7 పరుగుల తేడాతో గెలిచింది. వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో పంజాబ్‌ను విజేతగా ప్రకటించారు. రెండో మ్యాచ్‌లో శిఖర్ ధావన్ సేన పటిష్టమైన రాజస్థాన్ రాయల్స్‌ను 5 పరుగుల తేడాతో ఓడించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.